ప్రజాశక్తి

Vol. 4, no. 25

(Jun. 21, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 4, no. 25

(Jun. 21, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 సంచిక 25	: సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ	★	పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు	బుధవారం 21-6-44



"పదండి" - ముందుకు పోదాం: జర్మనీ నడిగడ్డమీదనే నాజీలకు సమాధికడదాం

జూన్ 22

—///—

తుమ్మల వెంకటరామయ్య

పవిత్ర సోవియటుభూమిపై జర్మను ఫాసిస్టుహంతకులు దురాక్రమణ గావించి మూడుసంవత్సరాలు గడుస్తోంది. 1941 జూన్ 22 వ తేదీరాత్రి నాల్గుగంటలకు హఠాత్తుగా జర్మను ఫాసిస్టుమూకలు, సోవియటుతోటి నిరాక్రమణ సంధినుల్లంఘించి, ఆదేశంపై బడ్డాయి. నాటినుండి నేటివరకు సోవియటు ప్రజలు గావించిన అపారత్యాగాలకు, ప్రదర్శించిన అద్భుతసాహసాలకు, వెల్లడించిన యుద్ధతంత్రకౌశల్యానికి ప్రపంచం దిగ్భ్రమ నొందింది.

హిట్లరు పగటికలలు

యూరప్‌లో నల్లేరుమీద బండిలానడచి, కొంచిన విజయాలతో కండ్లు కావరమెక్కిన హిట్లరు, సోవియట్ యూనియన్‌ను అతి సులభంగా జయించగలమనుకొన్నాడు. ఒక్కదెబ్బతో లెనిన్‌గ్రాడ్, మాస్కోలను పట్టుకొని, ఒకటి రెండునెలలో యూరల్సును చేరుకొని, త్వరలోనే యుద్ధం పూర్తిచేయాలనుకొన్నాడు. సోవియటుపై యుద్ధంచేసే కాలంలో బ్రిటను తనతో సంధికి వస్తుంది, లేదా సోవియటుపనిపట్టాక బ్రిటన్‌ను లొంగదీయవచ్చు నని హిట్లరు ఆశించాడు. కాని హిట్లరు ప్లానులన్నీ తలక్రిందులయ్యాయి. హిట్లరు మదాంధతకు నిదర్శనం కావాలంటారా - చూడండి. 1940 నవంబరులోనే "ఫాదర్ ఓడో" తో సంభాషిస్తూ హిట్లర్ స్టాలిన్‌ను సంకెళ్ళతో బెర్లిన్ తెస్తానన్నాడు. సోవియటుపై యుద్ధం ప్రకటించిన రెండుమూడు వారాలలో మాస్కోలో వుంటాననీ, యుక్రెయిన్, వాల్గా, కాకాసస్, బాల్టిక్ దేశాలు స్వాధీనం అవుతాయనీ, అన్నాడు.



సోవియట్ ఛీఫ్ ఆఫ్ స్టాఫ్ - మార్షల్ వాసిలెవ్‌స్కీ. 'ఆర్డర్ ఆఫ్ విక్టరీ' (విజయపతకం) బిరుదాంకితుడు

ఇలా పిచ్చికలలు గన్నాడు హిట్లరు. ఇంగ్లండుతోచక్కబరుచుకోడాని కని పంపబడినహెస్సఅరెస్టయాడు. పైగా అంగ్లో-సోవియటు ఒడంబడిక జరిగింది. ఫాసిస్టు దురాక్రమణకు గురియైన ప్రజలకు సోవియటుయూనియన్ నాయకత్వం వహించి పోరాడసాగింది. "మనది ధర్మపక్షం. శత్రువు నాశనం తప్పదు. విజయం మనదే -" అని యుద్ధప్రారంభదినంలోనే మాలటావ్ చెప్పినమాటలు నేడురుజువవుతున్నాయి.

నాజీల ప్రాథమికవిజయాలు

జూన్ 22న హిట్లరు 170 డివిజన్ల సైన్యంతో, బాల్టిక్‌సముద్రం నుండి నల్లసముద్రంవరకు 1800 మైళ్ళ రంగంలో, దాడిసల్పాడు. హిట్లరుకు ఇదివరకువచ్చిన విజయాలనుబట్టి, హిట్లరుసైన్యం అజేయమైనదనీ, హిట్లరు మెరుపుయుద్ధానికి (బ్లిట్స్‌క్రీగ్) ఎదురులేదనీప్రపంచమంతా అనుకొనసాగింది. సెప్టెంబరులో లెనిన్‌గ్రాడ్, ఒడెస్సా, కీవ్, బ్రియాన్స్కలనుహిట్లరుసమీపించాడు. మాస్కో వైపుకు పోడానికి స్మోలెన్స్క రంగంలో విజృంభించాడు. జులైమధ్యనుండి సెప్టెంబరు వరకు స్మోలెన్స్కలో తీవ్రయుద్ధం జరిగింది. స్మోలెన్స్కయుద్ధంతో ప్రపంచానికి రెడ్‌ఆర్మీ దాటివెల్లడయింది. నిరాఘాటంగా జర్మను సైన్యాలు సాగిపోగలవనే భ్రమను స్మోలెన్స్క పోగొట్టింది. మెరుపుయుద్ధానికి ప్రతిక్రియ స్మోలెన్స్క చూపింది. కొన్నిరోజుల్లోనే మాస్కోలో తిష్టవేసికొందామనుకొన్న నాజీకలలు పగటికలలయ్యాయి. స్మోలెన్స్క నగరంతర్వాత జర్మన్ల వశమయినప్పటికీ, జర్మను టైంటేబిల్ అంతామారిపోయింది. మాక్సువెర్నర్ అన్నట్లు, "స్మోలెన్స్కలో విజయం జర్మన్లది కాదు, రష్యన్లది. రెండవప్రపంచయుద్ధంలో రష్యన్‌లు పొందిన ప్రథమవిజయం ఇది. జర్మన్లు పొందిన మొదటి అపజయంకూడా ఇదే."

తీవ్ర ప్రతిఘటనతో తృప్తిపడక, అప్పుడప్పుడు రెడ్ ఆర్మీ ఎదురుదాడులు సాగించింది. ఎల్నాను (స్మోలెన్స్క రంగంలో) పట్టుకొందికూడా.

అజేయమైన మాస్కో

హిట్లరు సైన్యాలు, ఎన్ని విపరీతనష్టాలు కలుగుతున్నా లెక్కచేయకుండా మాస్కో, లెనిన్‌గ్రాడ్‌ల వైపు పురోగమించాయి. మొదట మాస్కో విజయం సులభమనుకొన్నాడు హిట్లరు. మాస్కోలో ఎక్కడెక్కడ తమ సైన్యాలు చలికాలంలో నివశించాలో అంచనావేశాడు. అక్టోబరు 2వ తేదీన పెద్దదాడి సాగించుతున్నానని హిట్లరు ప్రకటించాడు. అక్టోబరు 12వ తేదీన గోబెల్సు, తాను తెల్పబోయే విజయవార్తకు ఖాళీ వుంచమని పత్రికాధిపతులకు చెప్పాడు. కాని మాస్కో వశంకాలేదు. మాస్కో వశమయితే, సోవియటు రాజధానీ నగరం పడిపోయిందని ప్రగల్భాలు కొట్టుకోడానికే కాదు హిట్లరు ఆశించింది. చలికాలంలో తన సైన్యాలకు మాస్కోలో స్థావరంచిక్కితే, ఆ తర్వాత మరింత వేగంగా యుద్ధాన్ని ముగించగలననుకొన్నాడు. మొదటిదాడి ఆగిపోయింది. మాస్కోకు పశ్చిమంగా అర్ధచంద్రాకారంలో వున్న కాలినిన్ - మొజాయిన్స్క, మాలో-యరోస్లావెట్సు, తులా, నగరాలలో భీకరయుద్ధాలు జరిగాయి.

నవంబరు 16 వ తేదీన హిట్లరు మాస్కోపై రెండవదాడి సాగించాడు. "ఏమైనాసరే మాస్కో మనవశం కావలసిందే" అని అజ్ఞాపించాడు. మాస్కోపైన 50 డివిజన్లను (ఇందులో 13 టాంకు డివిజన్లు) 3 వేల ఫిరంగులను వుపయోగించాడు. మాస్కో యుద్ధంలో, జర్మన్లకు 3 రెట్లు టాంకులు, 2 రెట్లు విమానాలు ఫిరంగులు, $1\frac{1}{2}$ రెట్లు ట్రెంచి మోర్టార్లున్నాయి. ఒకచోట మాస్కోకి 15 మైళ్లలోకి శత్రుసైన్యాలు వచ్చాయి. కాని, మాస్కో ప్రజలు టాంకులకు తమ శరీరాలడ్డి, మాస్కోను రక్షించారు. అప్రతిమాన సాహసంతో, అపారత్యాగాలతో, మాస్కోపౌరులు, సోవియటు సైనికులు, హిట్లరు రెండవదాడినికూడ విఫలం చేశారు. డిశంబరు పదివరకు జరిగిన ఈ యుద్ధంలోజర్మనీ 1500 టాంకులను పోగొట్టుకొంది. 85 వేలమంది జర్మన్లు మాస్కోకు బలి అయ్యారు.

"నెపోలియన్ మాస్కోలోనైనా ప్రవేశించగలిగాడు. కానిహిట్లరు అదీలేదు. హిట్లరుకు మాస్కో లభించదు. కాని, మాస్కో ఫొటో లభించితే లభించవచ్చు." అన్న లోజవోస్కీ వాక్యాలు నిజమయ్యాయి.

దక్షిణరంగంలో డాన్‌మైదానాలను ప్రవేశించి, రొస్టావ్‌గుండా కాకసస్‌ను ప్రవేశించాలని హిట్లరు ఆశించాడు. అక్టోబరులో దాడి సాగించాడు. నవంబరులో రోస్టావ్‌ను ఆక్రమించుకున్నాడు. క్రిమియా (సెబాస్తపోల్ తప్ప) కూడా వశమయింది. 1941 అక్టోబరులో సెబాస్తపోల్ ముట్టడి జరిగింది. కాని మాస్కోవద్ద లాగానే, సెబాస్తపోల్ వద్దకూడ అమోఘంగా సోవియటు నావికులు, సైనికులు, ప్రతిఘటించారు. తర్వాత 250 రోజులకుగాని సెబాస్తపోల్ జర్మన్ల చేజిక్కలేదు.

లెనిన్‌గ్రాడ్ ముట్టడి

ఉత్తరాన లెనిన్‌గ్రాడ్ రంగంలో కూడ ప్రమాదం తక్కువగా లేదు. లెనిన్‌గ్రాడ్ చుట్టూ రక్షణ నిర్మించ సాగారు లెనిన్‌గ్రాడ్‌పౌరులు. స్త్రీలు, పురుషులు, బాలురు అనేభేదం లేకండా ఫ్యాక్టరీలలో, విమానదాడి రక్షణలో, యుద్ధశ్రేణిలో ముందుండి పనిచేయసాగారు. 1941 ఆగస్టు 27 న మెగాను జర్మన్లు వశంచేసుకొన్నారు. లెనిన్‌గ్రాడ్‌కు ఇతర ప్రపంచంతో సంబంధం లేకండా పోయింది. లెనిన్‌గ్రాడ్‌పై అనేకవేలసైన్యాలనుదూకించి, హిట్లరు విఫలుడయ్యాడు. చివరకు 1941 నవంబరులో హిట్లరు "లెనిన్‌గ్రాడ్ దానంతటదే లొంగుతుంది. దానికి విముక్తి కలించడం ఎవ్వరితరమూ కాదు. లెనిన్‌గ్రాడ్ పౌరులు పస్తుండి చచ్చిపోతారు" అని అన్నాడు. కాని లెనిన్‌గ్రాడ్ లొంగలేదు. లెనిన్‌గ్రాడ్ అచంచలంగా నిలిచింది. ఈ విధంగా సోవియటు-జర్మనీయుద్ధ ప్రథమదశ ముగిసింది.

శీతాకాలంలో ఎదురుదాడి

నవంబరు మాసాంతంలో రోస్టావ్‌ను రెడ్‌ఆర్మీ వశపరచుకొంది. డిశంబరు 6 వ తేదీన కామ్రేడ్ స్టాలిన్ సోవియట్‌సైన్యాలను "పదండి ముందుకు" (మిగతా 12వ పేజీలో)

బుధవారం ప్రజాశక్తి 21-6-44

గాంధీజీ - వేవెల్ లేఖలు

ఈనెల 19 వ తేదీ పత్రికలలో గాంధీజీకి - వైస్రాయికిమధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రకటించబడ్డాయి. గాంధీజీ లేఖలలో మరల ఒకసారి తాము జపాన్ ఓటమిని, మిత్రమండలి విజయాన్ని కోరుతున్నామని స్పష్టపరచాడు. మిత్రమండలి విజయంతోపాటు భారత స్వాతంత్ర్యాన్ని కోరుతున్నామన్నాడు. భారతదేశం విదేశ పరిపాలననుండి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరుతూంది; అందువల్లనే జపాన్‌దాడిని కూడా ఎదిరించుతుంది అని విశదపరచాడు.

కాంగ్రెసు జపాను అనుకూలమని నిందించజాలనన్నాడు వైస్రాయి. కాని బొంబాయి తీర్మాన ఫలితంగానే ఆగష్టు సంఘటనలకు దారితీసిందన్నాడు. ఈ వాదనను గాంధీజీ ఖండించాడు. ప్రభుత్వం నాయకులను ఆకస్మికంగా అరెస్టుచేయుటే దుస్సంఘటనలకు కారణమన్నాడు. కాంగ్రెసు ఎన్నడూ విధ్వంసక కార్యక్రమం అంగీకరించలేదన్నాడు. దౌర్జన్యరాహిత్యం కాంగ్రెసు పాలసీలో భాగమన్నాడు.

వైస్రాయి అసెంబ్లీ ఉపన్యాసంలో డిటెన్షనులో ఉన్నవారు కొందరు ఉన్నతాశయాలు గలవారని గుర్తించాడు. కాని వారు ఆగస్టు తీర్మానంలోని విధానాన్ని వదలివేయడానికి, దేశాన్ని భవిష్యత్తులో ఎదుర్కొంటున్న గొప్ప కార్యాలలో సహకారం చేయడానికి, సంసిద్ధతను తెలుపుటకు ఆటంకం ఉండకూడదన్నాడు ప్రస్తుత ప్రభుత్వంలో పాల్గొనడానికి ఒకవేళ యిష్టంలేకపోతే, భవిష్యత్ సమస్యలను చర్చించడంలో సాయపడవచ్చునని కోరాడు. వీటికి సమాధానంగా గాంధీజీ యిలాఅన్నాడు: "కొన్నివందలమంది స్త్రీలు—పురుషులు సమావేశమై, చర్చించి ప్యాసుచేసిన తీర్మానాన్ని ఒక్కరు ఎలా ఉపసంహరించుకోగల్గుతారు? మళ్ళీ సమిష్టిగా చర్చించినపుడే ఉపసంహరించుకోడం సాధ్యపడుతుంది" అని జవాబుయిచ్చాడు. దీనినిబట్టి ఒక విషయం స్పష్టపడుతూంది. గాంధీజీ, ఆగస్టు తీర్మానాన్ని పునరాలోచించడానికి తక్కిన కాంగ్రెసునాయకుల సమావేశం (అఖిలభారత కాంగ్రెసుకమిటీ) అయినపుడే సాధ్యమవుతుందని తెలుపుతున్నాడు.

వైస్రాయి గాంధీజీకి మార్చి 28 తేదీన వ్రాసిన లేఖలో ఇలాచెప్పాడు: "భారతదేశం యుద్ధానంతర ప్రపంచంలో తనకు అర్హమైన స్థానాన్ని పొందడానికి ఆర్థికరంగంలో యెంతో పనిచేయవలసివుంది. ప్రజల జీవిత పరిమాణాన్ని హెచ్చించడానికి అనేక ముఖాలుగా మార్పు, అభివృద్ధి, జరగాలి. ఇలాంటిపని ముఖ్యంగా రాజకీయాలలో సంబంధంలేనిదే. అయినప్పటికీ యీపని రాజకీయ పరిష్కారానికి దారితీయవచ్చు. ప్రతిష్టంభన తొలగేవరకు యీపనిని ఆపుచేయడానికి మాత్రం వీలులేదు.... ఈ పనిలో అన్నిపార్టీల నాయకులు సహకారం చేయాలి. తద్వారానే వారు దేశాన్ని స్వాతంత్ర్య గమ్యస్థానంవైపుకు తీసికొనిపోగలరు ప్రస్తుతం కాంగ్రెసు పార్టీ అవలంబించుతున్న పాలసీ భారతదేశ స్వాతంత్ర్యానికీ, అభివృద్ధికీ ఆటంకం కలిగించుతూందేగాని, దోహదమివ్వడంలేదని చెప్పవలసి వచ్చినందుకు విచారపడుతున్నాను" అని వైస్రాయి తన పాలసీని వివరించాడు.

దీనినిబట్టి రాజకీయ సమస్యను మూలకునెట్టి, ఆర్థిక పునర్నిర్మాణంద్వారా భారత పెట్టుబడిదారీ వర్గాన్ని వేవెలు ఆకర్షించదలచాడని తేలుతుంది. సర్ ఆర్దేశ్వర్ దలాల్‌ను వైస్రాయి కార్యనిర్వాహకవర్గంలోకి తీసికోడం దీనినే సూచించుతుంది. బిర్లా బ్రదర్స్‌కు, వాల్చెంద్ హీరాచెంద్‌కు మోటారు పరిశ్రమ నిర్మాణానికి ఇండియా ప్రభుత్వం అనుమతి యివ్వడంకూడ యీ విషయాన్నే ఋజువుచేస్తుంది

ఈమధ్యనే బొంబాయిలో సమావేశమయిన భారత వ్యాపారమండలి తీర్మానాలు చూడండి. వారు గాంధీజీని విడుదలచేసినందుకు వైస్రాయిని అభినందించారు. తక్కిన కాంగ్రెసునాయకులను విడుదలచేసి జాతీయప్రభుత్వం ఏర్పరచమని కోరారు. సర్ ఆర్దేశ్వర్ దలాల్ వైస్రాయి కార్యనిర్వాహకవర్గంలో నియమించబడినందుకు అభినందించారు. భారత పెట్టుబడిదారులు పై విధంగా జాతీయవాంఛలను బలపరుస్తున్నారు. కాని వారు మితవాదులవలెనే వైస్రాయి దయపై ఆధారపడుతున్నారు. ప్రధాన రాజకీయపక్షాలైన కాంగ్రెసు - లీగ్ ఐకమత్యం యొక్క అవుసరాన్ని గుర్తించడంలేదు.

ఈ సమయంలో జిన్నా పాకిస్తాన్‌నినాదంయొక్క వివరాలను తెలిపి, కాంగ్రెసు దేశభక్తులకు పాకిస్తానంటె వున్నసందేహాలను తొలగించాలి అపుడు కాంగ్రెసు దేశభక్తులు ముస్లింజాతుల స్వయంనిర్ణయహక్కును అంగీకరించడం సులభమవుతుంది. దేశభక్తులందరు ఒకవిషయం గమనించాలి. భారతప్రజలకు స్వాతంత్ర్యం, ముస్లిం జాతులకు స్వయంనిర్ణయహక్కు కాంగ్రెసు - లీగ్ ఐకమత్యంద్వారానే వస్తాయి. అపుడే రాజకీయసమస్యను వెనుకకు నెట్టాలనే వేవెలు ప్రయత్నాలను ఓడించగలుగుతాం. జాతీయప్రభుత్వాన్ని సంపాదించి దేశీయ ఆర్థికపునర్నిర్మాణాన్ని జయప్రదంగా సాధించగలుగుతాము, గాంధీజీ - వైస్రాయి లేఖలు జాగ్రత్తగా పరిశీలించిన, దేశభక్తులందరు ప్రస్తుతం యిదే కర్తవ్యమని గ్రహించగలుగుతారు.

ఫ్రాన్సులో మిత్రసేనల విజయం

ఫ్రాన్సుపై దండయాత్రను కామ్రేడ్ స్టాలిన్ "అద్భుతవిజయం" అని అన్నాడు. "నెపోలియన్ ఇంగ్లీషుఛానెల్ దాటలేకపోయాడు. బ్రిటిష్ దీవులను పట్టుకోలేకపోయాడు. రెండేళ్లుగా ఇదిగో వస్తాను, అదిగో వస్తాను అని ప్రగల్భాలు పల్కిన హిట్లరు ఇంగ్లీషుఛానెల్ దాటడానికి ప్రయత్నమైనా చేయలేదు. ఇప్పుడు బ్రిటిషు అమెరికా సైన్యాలీవిజయాన్ని సాధించాయి" అంటూ స్టాలిన్ ప్రశంసించాడు. జనరల్ మాంట్‌గొమెరీకూడ "కోస్తాయుద్ధాలలో మనం గెల్చాం" అంటూ క్లుప్తంగా మొదటి 5 దినాల యుద్ధాన్ని గురించి చెప్పాడు.

మొదటిదశలోమిత్రసైన్యాలునిరాఘాటంగా ముందుకుపోయాయి. 60-8 మైళ్ళ పొడవున కాలూని, 10-18 మైళ్లవరకు ముందుకు పోయాయి. జర్మన్లు ఫ్రాన్సుతీరాన నిర్మించుకున్న రక్షణలు తమకు వ్యవధిని యిస్తాయని తలచారు. కాని అట్టిదేమీ సంభవించలేదు. రక్తస్రవంతులను ప్రవహింపజేసి, అమెరికన్, బ్రిటిషు, కెనడా సేనలు జర్మను రక్షణ శ్రేణిని ఛేదించాయి.

రెండవ దశలో జర్మన్లు ఎదురుదాడులను సాగించారు. గతవారం మిత్రసైనికులు పట్టుకొన్న మాంట్‌బర్గును, మరి రెండు పట్టణాలను స్వాధీనం చేసికొన్నారు. కొన్ని ప్రదేశాలలో మిత్రసేనలు వెనకడుగు వేయవలసి వచ్చింది. కాన్‌వద్ద భీషణంగా యుద్ధాలు జరిగాయి కాని, ఈ తిరుగుదాడులకు తట్టుకొని మిత్రసేనలు ముందుకు పురోగమించుతున్నాయి. కారంటన్, లిజాన్, కూయన్‌వెల్లీ సైంట్‌సావూర్, మొదలగు పట్టణాలను పట్టుకొన్నారు మాంట్‌బర్గు మళ్ళా వశమయింది. మిత్రసేనల ఆశయం కొటెన్టిన్ (చెర్‌బోర్గు) ద్వీపకల్పం పట్టుకొని, చెర్బోర్గ్ రేవును ఆక్రమించుకొని, తమ సప్లయిలకు కేంద్రాన్ని ఏర్పరుచుకోడం. ఈ ద్వీపకల్పాన్ని ఇతర ఫ్రాన్సుతో సంబంధంలేకుండా తెగగొట్టాయి మిత్రసైన్యాలు. దక్షిణభాగంలో కొద్దిభాగం గుండా మాత్రం జర్మన్లు పలాయన మంత్రం పఠించుతున్నారు. త్వరలోనేఇప్పటికన్న పెద్ద యుద్ధాలు సాగించడానికి రెండుపక్షాలు సిద్ధమవుతున్నాయి.

ఫ్రాన్సుపై దండయాత్ర జర్మనీ సేనానాయకులకు గుండెదడ కల్గించుతోంది. లెఫ్టినెంట్ జనరల్ డిట్టమార్ ఇలా అన్నాడు "ఇదిమామూలుయుద్ధంకాదు.రాజకీయంగాను, సైనికంగాను తీవ్రమైన మార్పులు తీసుకు రాడానికి విజృంభించుతున్న యుద్ధం"

ఫ్రెంచి గెరిల్లాల విజృంభణ

ఫ్రెంచి దేశభక్తులు యుద్ధశ్రేణుల వెనుక కల్గించే విపరీత నష్టాలకు నాజీలు హడలుతున్నారు. గెరిల్లాలను కాల్చివేస్తాం, వాళ్లను మామూలు శత్రుసైనికులవలెచూడం -అంటూ నాజీనాయకులు ప్రకటించారు. కాని ఈ బెదరింపులు పనిచేయడంలేదు. మిత్రసేనలు ఫ్రాన్సుపై దిగగానే గ్రామస్థులు వారిని ఆదరించి వైద్యసహాయం చేశారు. ఫ్రెంచి గెరిల్లాలు కొన్ని పట్టణాల నాక్రమించుకొన్నారని ఒకవార్త. స్విస్ సరిహద్దులో పర్వతప్రాంతాలలో ఉద్యమం విజృంభించిందని మరొకవార్త. ఫ్రెంచి తాత్కాలికప్రభుత్వం తరపున ఎమాన్యుయల్‌డాస్టీర్ మాట్లాడుతూ ఫ్రెంచి గెరిల్లాలు జర్మనుసైనికులను, మందుసామగ్రి బండ్లనూ వశంచేసుకున్నారని తెల్పాడు. ఫ్రాన్సులో నాజీగూఢచారిదళాల నాయకుని ఫ్రెంచి గెరిల్లాలు పట్టుకొని ఉరితీశారు.

ఈవిధ గా ఫ్రెంచిదేశభక్తులు మిత్రసేనలకు సహాయంచేస్తూ, తమ మాతృదేశవిముక్తికై పోరాడుతున్నారు. కాని ఫ్రాన్సు విముక్తికై పోరాడుతున్న ఫ్రెంచి స్వాతంత్ర్య కమిటీని, ఆంగ్లో-అమెరికన్ అభివృద్ధి నిరోధకులు గుర్తించకుండా తప్పించుకోవాలని చూస్తున్నారు. దానిపై తీవ్రఆందోళన బయలుదేరింది. బ్రిటిషు, అమెరికన్ పత్రికలు ఈ వైఖరినిఆక్షేపించాయి. పార్లమెంటులో ప్రశ్నల వర్షం కురిసింది. చర్చిల్ తానీ విషయమై ఎట్టి సముచిత సమాధానం ఈయకపోయినా, ఇది అతనిబలాన్ని చూపడంలేదు. బలహీనతనే చూపుతుంది.

ఈలోగా ఫ్రెంచి స్వాతంత్రకమిటీ ఊరుకోలేదు. విముక్తిచెందిన నార్మండీ ప్రదేశానికి ఒక కమీషనర్‌ను పంపింది. అతనిపేరు ఫ్రాంకోవా కాలెట్. అలాగే 3 వ మిలిటరీ ప్రదేశానికి ఒక కమాండర్‌ను - ఇ. బెవెసీను నియమించింది. డీగాల్ స్వయంగా నార్మండీ వెళ్ళి ఫ్రెంచి దేశభక్తులను ప్రబోధించాడు. ఈనాడు ఫ్రెంచి ప్రజలైక్యంగా ఉన్నారు. ఫ్రెంచి స్వాతంత్ర్య కమిటీ వెనుక వివిధ పక్షాలు (16) అండగావున్నాయి. వీటిలో ముఖ్యంగా కార్మికులు బలంగా ఉన్నారు. అందు అభివృద్ధి నిరోధకులు, జనరల్ వేగాండ్‌ను ఫ్రెంచి గద్దెపైకి తీసుకు రావాలనిచేసేప్రయత్నం వెనుకడార్లాన్ విషయంలో వలెనే, భగ్నం అవుతుంది.

ఇసన్‌హోవర్ రూజ్‌వెల్టుకు పంపించిన సందేశంలోను, కాలినిన్ మిత్రరాజ్యాలకు పంపిన సందేశంలోను, త్వరలోనే తూర్పున రష్యానుండి, దక్షిణాన మధ్యధరాసముద్రం నుండికూడా ఎడాపెడా దావుదెబ్బలుహిట్లరుపై పడనున్నాయని తెలుస్తోంది.

ఫిన్లండు

జనరల్ గొవరావ్ నాయకత్వాన విన్నిష సైన్యాలు మొదటిరెండు రక్షణశ్రేణులను ఛేదించి, ఇపుడు అసలు మానర్‌హీమ్ శ్రేణినే బ్రద్దలుచేశాయి. 18 మైళ్ళ వెడల్పున గండి గొట్టాయి. విపూరి (వైబర్గ్) కి 18 మైళ్ళలోకి వచ్చాయి.

ఇటలీ

ఇటలీలో, రోముకు వాయువ్యంగా పంచమ సైన్యం 90 మైళ్లు ముందుకు పోయింది. 8 వ సైన్యం పెరూజియాను సమీపించుతోంది. ఏడ్రియాటిక్ తీరంలో ఇటాలియన్ గెరిల్లాలతో సంబంధం ఏర్పడింది. ఎల్బా, పియోనోజా దీవులలో మిత్రసైన్యాలు దిగాయి.

అస్సాం - బర్మా రంగం

కోహిమాలో పూర్తిగా శత్రువులు తుడిచిపెట్టబడ్డారు. కోహిమా - ఇంఫాల్ రోడ్డు మధ్య జపాను సేనలను మనవాళ్లు తరుముతున్నారు. స్టిల్‌వెల్ సైన్యాలు కామయాంగును పట్టుకొని, మొగాంగ్‌ను సమీపించాయి.

19—6—44.

— తుమ్మల వెంకట రామయ్య

★ మనరాజకీయాలు : కంభంపాటి సత్యనారాయణ ★

ప్రాచ్యదేశాలకు నూతనభవిష్యత్తు

అమెరికన్ ఉపాధ్యక్షుని ఉజ్వల సందేశం

అమెరికన్ ఉపాధ్యక్షుడైన హెన్రీ వాలెస్ "పసిఫిక్ ప్రాంతంలో మనకర్తవ్యం" అనేశీర్షికక్రింద ఈమధ్యఒకవ్యాసం వ్రాశాడు. అందులో అతడు, వలసదేశాలలో నివశించే ప్రజలందరికి స్వతంత్రఆసియాలో స్థానం ఉండాలనీ, అందుకు అమెరికా నాయకత్వం వహించి కృషి చేయాలనీ, ప్రకటించాడు. ఇండియా, బర్మా, మొదలైన దేశాల నుద హరిస్తూ ఆసియాఖండంలో కొన్ని బానిస దేశాలుగాను, కొన్ని స్వతంత్ర దేశాలుగాను ఉండటం అసంభవమని తెలిజేశాడు.

"యుద్ధానంతరం చైనా ప్రజాస్వామ్య పరిపాలనకొరకు ముందడుగు వేయకమానదు. అట్టిపరిస్థితుల్లో, యితర ఏషియాటిక్ దేశాలపై రాజకీయంగా చైనా యొక్క ప్రభావం చాలాఉంటుంది. ఎప్పుడైతే ప్రజాస్వామ్యపరిపాలనగల చైనా స్వతంత్రభారత దేశంతో సహకారంచేసే సమయం వస్తుందో అప్పుడు ఆసియాఖండంలో సంపూర్ణస్వాతంత్ర్యస్థాపనకు మార్గం సరిచేయబడుతుంది. ఫిలిప్పయిన్ దీవులపట్ల అమెరికా చూపిన వైఖరి, ఆసియాలో నివశించే అల్పసంఖ్యాక జాతులపట్ల రష్యా ప్రదర్శిస్తున్న ఉన్నత దృక్పథం - యివి వలసదేశాల సమస్యపై బ్రహ్మాండమైనఒత్తిడి తీసుకురాగలవు. వలస దేశాలలో నివశించే ప్రజల బానిసత్వం, ఆర్థికంగా వారున్న అధోగతి, పోవాలి. వాటిస్థానేసంపూర్ణమైన ఆర్థిక స్వపరిపాలన, అభివృద్ధికి అవకాశాలు, కలగాలి. ఈ వైఖరి మనకుకూడా లాభదాయకమే"

అని హెన్రీవాలెస్ తనవ్యాసంలో వ్రాశాడు.

బ్రిటిష్ సామ్రాజ్యం శాశ్వతంగా వర్ధిల్లుతుందని కలలుగంటూన్న చర్చిల్ వైఖరికీ, యీ వైఖరికీ, ఎంత తారతమ్యం వుందో పై వాక్యాలను బట్టి తెలుసుకోవచ్చు. ప్రపంచ ప్రజలందరూ ప్రజాస్వామ్య సిద్ధాంతాలకై ఎంతపట్టుదలతో పోరుసల్పుతున్నారో, ఎలాంటి త్యాగాలుచేస్తున్నారో, హెన్రీవాలెస్ గుర్తించాడు. వారి భవిష్యత్తును వారే నిర్ణయించుకుంటారని గ్రహించాడు.

"దూరప్రాచ్య దేశాలలో ఆర్థికంగాను, రాజకీయంగాను, స్థాపింపబడవలసిన వ్యవస్థలో కొత్తసామ్రాజ్య విధానానికెట్టి స్థానం ఉండకూడదు."

అని హెన్రీవాలెస్ ఘంటాపథంగా చాటి చెబుతున్నాడు. అంతేకాదు. ఉభయ మిత్ర రాజ్య ప్రభుత్వాలు (ఇంగ్లండ్, అమెరికా) యిందుకై కృషిచేయాలని కూడా సూచిస్తున్నాడు.

ఈ ప్రకటన భారతీయులమైన మనకు ఎంతైనా, ఉత్సాహంయిస్తుంది. స్వాతంత్ర్యం కొరకు పోరాడే మనకు అమెరికా చేయూత నిస్తుందనడానికి ఎట్టి సందేహంలేదు.

ఐతే, హెన్రీవాలెస్ కరపత్రంలో మార్కెట్లను గురించి వ్రాసినవాక్యాలు కొందరిలో అనుమానాలకు దారితీస్తున్నాయి. దూర ప్రాచ్యదేశాలలో పరిశ్రమలు విరివిగా అభివృద్ధిచెందడానికి అమెరికా సహాయంచేస్తుందనీ, తద్వారా అక్కడిప్రజల జీవితపరిమాణం ఎక్కువౌతుందనీ, అప్పుడు అమెరికన్ సరకులకు మార్కెట్లు బాగా లభిస్తాయనీ, వాలెస్ వ్రాశాడు. ఈవిధానం మనదేశంవంటి దేశాలకు హానికరంగా పరిణమించకమానదని కొన్ని జాతీయపత్రికలు వ్యాఖ్యానిస్తున్నాయి. మరొకరూపంలో తిరిగి సామ్రాజ్యవిధానం తలయెత్తుతుందనే భయం ఆ వ్యాఖ్యానాలలో కనపడుతోంది.

అయితే, ఒక్కవిషయం ఆలోచించాలి. యుద్ధానంతరం పారిశ్రామికంగా మనం పైకి రావాలంటే, యంత్రాలకొరకు - టెక్నీషియన్లకొరకు, ఇతరదేశాలపైఆధారపడకుండా స్వంతంగానే తయారుచేసుకునేస్థితిలో మనం ఉన్నామా? వ్యవసాయంలో కొత్తప్రాజెక్టుల నిర్మాణానికి, యంత్రపరిశోధనలకు, అమెరికా వంటి దేశాలపై మనం ఆధారపడవద్దా? అట్టి సహాయం మనకు హానికరం గాకుండా, లాభకరంగా పరిణమించేలా చూడ్డానికి పెత్తనం మన ప్రజల చేతుల్లో వుంటుంది. అంతిమనిర్ణయాలు చేయవలసింది, చేయగలిగేది, మనం; పెత్తనం మనచేతుల్లో వున్నప్పుడు, ఎవరూ దాన్ని హరింపలేరు. రష్యాలో విప్లవంవచ్చాక, సోవియట్ నాయకులు పారిశ్రామికంగా తమ దేశాన్ని అభివృద్ధి చేసుకోడానికి అమెరికా నుంచి విరివిగా యంత్రసామగ్రిని, టెక్నీషియన్లను తెచ్చుకున్నారు. అంతమాత్రంచేత రష్యా అమెరికన్ల పెత్తనంకిందికి పోయిందా?

మనదేశం విషయంకూడా అంతే.

కాబట్టి, ప్రాచ్యదేశాల భవిష్యత్తును గురించి అమెరికన్ ఉపాధ్యక్షుడిచ్చిన సందేశాన్ని మనం అభినందించక తప్పదు. "పారిశ్రామికంగా ముందున్న దేశాలకు మార్కెట్లు అవసరమే. అయినప్పటికీ, అట్టి మార్కెట్లను రాజకీయ సామ్రాజ్యాలుగా మార్చనవసరం ఉండదు." అని హెన్రీవాలెస్ స్పష్టమైన భాషలో, ఎట్టి అనుమానాలకు స్థానంలేకుండా, చెప్పాడు.

పి. సి. రే అస్తమయం

సుప్రసిద్ధ బెంగాలీ రసాయన శాస్త్రజ్ఞుడు, నిష్కళంక దేశభక్తుడు, ఐన ప్రఫుల్లచంద్ర రే మొన్న 16 వ తేదీని కలకత్తాలో అస్తమించారు. వీరి వయస్సు 82.

15 సంవత్సరాల పరిశోధన ఫలితంగా, రే "హిందూ రసాయనశాస్త్ర చరిత్ర" అనే ఉద్గ్రంథాన్ని రచించారు. 'బెంగాల్ కెమికల్ అండ్ ఫార్మస్యూటికల్ వర్క్స్' అను పారిశ్రామికసంస్థను స్థాపించారు. మహాత్ముడు ప్రారంభించిన ఖాదీ ఉద్యమానికి చేయూతనిచ్చారు. ఆజన్మ బ్రహ్మచారిగానే జీవితం గడిపారు.

హిట్లరు సోవియట్ యూనియన్‌పై దుమికినప్పుడు బెంగాలీ రచయితలు, కళావేత్తలు, మేధావంతులు కలిసి పి. సి. రే నాయకత్వాన ఒక ప్రకటన గావిస్తూ, హిట్లరు దురాక్రమణను ఖండించారు.

మానవ విజ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్ళడంలో కృషిసల్పిన పి. సి. రేకి యివే మా జోహారులు.

వార్తలు - విశేషాలు

● దేశంలో బొగ్గు, వెదురు తగినంతగా సప్లయి కానందున, ప్రజల అవసరాలలో 100కి 35 చొప్పున మాత్రమే కాగితంఉత్పత్తిఅవుతోందనీ, అందువల్ల కాగితపుకంట్రోలులో యిప్పటికంటె ఇంకా కఠినమైన నిబంధనలువస్తాయనీ, ఇండియాప్రభుత్వం ప్రకటిస్తోంది.

● నైజాంరాష్ట్రమందలి జాగీర్దార్లు తమ ఆధీనంలోవున్న ప్రదేశాలలో సంస్కరణలు తీసుకురాకపోతే, వారిపై చర్యతీసుకుంటామని నైజాంప్రభుత్వం ప్రకటిస్తోంది.

● తిరువాన్కూరు స్టేట్ కాంగ్రెసు కమ్యూనిస్టులతో కలిసి పనిచేస్తే, చర్యతీసుకోవలసివస్తుందని బెదరిస్తూ దివాన్ సర్. సి. పి. గావించిన ప్రకటనకు స్టేట్‌కాంగ్రెస్ చక్కని జవాబిచ్చింది. కాంగ్రెసు ఆశయమైన బాధ్యతాయుత పరిపాలనకై పనిచేసే ప్రతి తిరువాన్కూరు నివాసి కాంగ్రెసులో ఉండవచ్చునని స్పష్టీకరించింది.

● ఇండియాలో వస్తువులధరలను స్థిరంగానిలిపి యుంచడానికీ, యుద్ధసరికరాల ఉత్పత్తిని ఉన్నతస్థాయిలో ఉంచడానికీ, మిత్రసేనల అవసరాలను తీర్చడానికీ, అమెరికన్ ప్రభుత్వం ఇండియాప్రభుత్వానికి 10 కోట్ల ఔన్సుల వెండిని అప్పుగా యివ్వడానికి నిర్ణయించింది.

● గతసంవత్సరం కరువునివారణకై బెంగాలుప్రభుత్వం చేసినఖర్చుకు పరిహారంగా 10 కోట్ల రూపాయలు యివ్వడానికి ఇండియా ప్రభుత్వం నిర్ణయించింది.

● గతమాసం కలకత్తా ఏరియాలో నిల్వ వ్యాపారంచేసిన నేరానికి మొత్తం 499 గురిపైకేసులు పెట్టబడ్డాయి యు. పి. రాష్ట్రంలో నిల్వవ్యాపారం చేసినందుకు 320 కేసులలో తీర్పులు యివ్వబడ్డాయి. వీరిలో 253 గురికి శిక్షవిధించారు.

● అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు, కామ్రేడ్ డాంగే, బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ ఉద్యమంతో దగ్గర సంబంధాల నేర్పరచుకోవడానికి మూడు నాలుగు నెలలు బ్రిటన్‌లో ఉంటాడు.

● జి. డి. బిర్లాతోబాటు, వాల్చెందు హీరాచంద్ స్థాపించబోయే మోటారు పరిశ్రమకు కూడా ఇండియాప్రభుత్వం అనుమతిఇచ్చింది.

● మద్రాసు ముస్లింలీగ్ విద్యార్థిసంఘం తరపున బెంగాల్‌లో 6 వారాలుండి, ప్రజలకు వైద్యసహాయంచేసిన డాక్టర్లసంఘం, తిరిగి యీనెల 15 వ తేదీన మద్రాసు చేరుకొంది. అంటువ్యాధులు యింకా ప్రబలంగానే ఉన్నాయనీ, వైద్యసహాయం చాలదనీ, వారు తెలియజేస్తున్నారు.

● అమెరికన్ ఎకాడెమీ ఆఫ్ పొలిటికల్ అండ్ సోషల్‌సైన్సు అనే సంస్థ తరఫున ఒక మాసపత్రిక ప్రచురింపబడుతోంది. మే నెల సంచిక భారతదేశ సమస్యనుగురించి సుప్రసిద్ధ భారతీయులు వ్రాసిన వ్రాసాలకు ప్రత్యేకించబడింది.

★

మున్షీ అపశకున వాక్యాలు

గాంధీజీ ఆరోగ్యంకొరకు దేశంఅంతా ఎదురుచూస్తోంది. రాజకీయ ప్రతిష్టంభనను అంతంచేయడానికి గాంధీజీ తన చేతుల్లో వున్న అవకాశాన్ని ఎలా వినియోగించుకుంటాడా? అని అందరూ ఎదురుచూస్తున్నారు. మహాత్ముడు కూడా వివిధదృక్పథాల రాజకీయాలతోసంబంధముంచుకొంటున్నాడు.

కాని, ఈలోగా పత్రికావిలేఖరులు గాంధీజీ మనోభావాలను గురించి వ్యాసాలు తెగరాస్తున్నారు. బ్రిటిషు ప్రభుత్వంతో రాజీ అసంభవమని ఆయన భావిస్తూన్నట్లూ, తిరిగి జైలుకే వెళ్ళవలసి యుంటుందనీ, - ఇంకా ఇలాగే నిరాశాజనకమైన వార్తలు ఎన్నోవస్తున్నాయి. దీనికితోడు "అఖండ హిందుస్థాన్" నినాదాన్ని ప్రచారంచేసే కె. ఎం. మున్షీ "గాంధీజీపై వున్న భారం" అను శీర్షికతో ఒక వ్యాసం వ్రాశాడు. "గాంధీజీ నెత్తినైవున్న భారాన్ని ఇతరులెవ్వరూ మోయడానికిష్టపడనప్పుడు, ఆయన మాత్రం ఎందుకు మోయాలి? గాంధీజీ విలువను ప్రపంచం, భారతదేశం, గుర్తించేటంతవరకు ఆయన వేచియుండవచ్చును; ఏమీ ఫరవాలేదు."

అని మున్షీ వ్రాస్తున్నాడు. ఇతరులు తమ కర్తవ్యాన్ని గుర్తించనపుడు మహాత్ముడు మాత్రం ఎందుకు గుర్తించాలి? అనే వాదనలో అర్థంలేదు.

ఒకవైపు అమెరీ, వర్కింగ్‌కమిటీ సభ్యుల్ని విడుదలచేసే సమయంరాలేదంటూ పదే పదే ప్రకటనలు చేస్తున్నాడు, మరొకవైపు జిన్నా కాశ్మీరకొండలుదిగి, క్రిందికిరావటంలేదు గాంధీజీ జాతీయ నాయకుడు. ఇప్పుడు లభించిన అవకాశాన్ని వినియోగించుకొని, ప్రతిష్టంభనను అంతంజేయడానికి ధైర్యంతో ఆయన ముందడుగు వేయవలసియుంది. అదే నేడు ప్రజానాయకుని కర్తవ్యం. జపాన్‌దండయాత్రనుండి దేశాన్ని రక్షించడానికి, ఆకలిజ్వాలలనుండి ప్రజలను రక్షించడానికి గాంధీజీ ముందంజవేయాలి. కాంగ్రెసు తరువాత పెద్దరాజకీయసంస్థఅయిన లీగుతో ఐకమత్యం కోసం కృషిచేయాలి. అపుడే గాంధీజీ ఇతర కాంగ్రెసునాయకులను విడిపించగలడు. బ్రిటిషుప్రభుత్వాన్నుంచి జాతీయప్రభుత్వాన్ని గుంజుకోగలుగుతాడు.

★ రైల్వే కార్మికవార్తలు

గ్రెయినుషాపుల్లో రేషనింగు పద్ధతి

రైల్వే గ్రెయిన్‌షాపులను స్థాపించిన ప్రథమంలో, కార్మికుల కుటుంబంలో యెందరు సభ్యులున్నా నలుగురికి మాత్రమే ఒక్కొక్కరికి నెలకు 9 పడుల చొప్పున బియ్యం సప్లయిచేసేవారు. అలా కాకుండా సభ్యులందరికీ బియ్యం సప్లయిచేయాలని చేసిన ఆందోళనా ఫలితంగా పై పద్ధతిని మార్చి, ఒక్కొక్కరికి 9 పడుల చొప్పున కుటుంబంలోని సభ్యులందరికీ యిచ్చేటట్టు నిర్ణయం జరిగింది. ఈ పద్ధతివల్ల కార్మికుల్లో సంతృప్తి కలిగింది. కాని హటాత్తుగా రైల్వే బోర్డు కొత్తపద్ధతిని ప్రవేశపెట్టింది. ఈపద్ధతి క్రింద కార్మికులు తమ కుటుంబాలతోసహా ప్రయాణం చేయుటకు యివ్వబడే ప్యాసులకు సంబంధించిన రూల్సు ప్రకారం బియ్యం రేష నింగు కూడా ఉంటుంది. ఈరూల్సు స్వల్ప జీతాలవారికి ఒక విధంగాను, గుమాస్తాలు మొదలైనవారికి మరొక విధంగాను యేర్పాటు చేయబడ్డాయి. మీనియల్సుకు (స్వల్పజీతాలవారు) 20 సంవత్సరాల సర్వీసు పూర్తిఅయ్యే వరకు డిపెండెంటుప్యాసులవసతిలేదు. గుమాస్తాలు మొదలైనవారికి యీ వసతి ఉన్నది. మీనియల్సుకు ఇచ్చే ప్యాసుమీద కార్మికుడు, అతినిభార్య, పిల్లలు మాత్రమే ప్రయాణం చేయాలి. డిపెండెంటు ప్యాసుమీద కార్మికుడు, తన కుటుంబం, వితంతుతల్లి, వితంతు అక్కచెల్లెండ్రు, మైనరు తమ్ములు, మైనరు చెల్లెండ్రు ప్రయాణం చెయ్యవచ్చును. ఈవిధంగా అసంతృప్తికరంగాఉన్న ప్యాసురూల్సు ప్రకారం పనివానికుటుంబం అతనిమీద ఆధారపడినవారుగా యెవరైతే నిర్ణయింపబడ్డారో, వారికి, పనివానికి చౌకధరలకు బియ్యం సప్లయిచేయాలని రైల్వేబోర్డు నిర్ణయించింది. ఈ నిర్ణయం పనివారలమీద ఆధారపడ్డవారికి గాక, ఇతర డిపెండెంట్సుకు చాలా నష్టం. వారు అధిక ధరలకు ఆహారపదార్థాలు కొనుక్కోవలసిందే. కార్మికుడు తన కుటుంబంలో కొందరికి చౌకగావస్తువులనుకొనుక్కోవడం, ఇతరులకు హెచ్చుధరలతో కొనుక్కోవడం చాలా అక్రమం. స్వల్పజీతంలో హెచ్చుధరలకు ఆహారపదార్థాలు కొనుక్కోవలెనని కోరడం అన్యాయం. ఈ అక్రమ పద్ధతిని రద్దుచేసి, కుటుంబ సంఖ్యనుబట్టి పదార్థాలను సప్లయిచేయాలని అన్ని శాఖలు మే 1 నుంచి 7 వరకు "ఆహార వారము"ను జరిపి, ఆందోళనచేయాలని యూనియన్ సెంట్రల్‌కౌన్సిల్ తీర్మానించింది. దీని ప్రకారం అన్ని శెక్షన్ల కార్మికులు ఆందోళన గావించి, పైజెప్పిన అక్రమపద్ధతిని రద్దుచేయమని రైల్వేబోర్డుకు తీర్మానాలు పంపించారు. ఆందోళనాఫలితంగా డిపెండెంట్సుగావున్నవారికేకాకుండా మిగతా యిద్దరికికూడా చౌక ధరలకు కొనుక్కొనే హక్కును రైల్వేబోర్డు గుర్తించింది. కార్మికులకిది విజయమే. కాని కుటుంబసంఖ్యను బట్టి పదార్థాలను సప్లయిచేసేవరకుకూడా పనివారలు ఆందోళన సాగించాలి.

★

గూడూరు రైల్వే సెక్షన్ కార్మికుల సభ

పాకాల బ్రాంచి యం. యస్. యం. రైల్వే కార్మికసంఘ ఆధ్వర్యాన, గూడూరు సెక్షన్ యింజనీరింగు పనివారలసభ 11-6-44 న కామ్రేడ్ ఇజరా ఆధ్యక్షతక్రింద వెంకటగిరి స్టేషన్‌వద్ద జరిగింది. తమ రోజువారి కష్టాలను చర్చించే ముందుగా గాంధీజీ ఆరోగ్యం కుదుట పడుచున్నందుకు కార్మికులు తమ సంతోషాన్ని వెలిబుచ్చుచూ తీర్మానించారు. మాతృదేశాన్ని కరువురాక్షసినుంచి కాపాడి, జపాన్‌దాడినుండి దేశాన్ని రక్షిస్తామనీ, దేశభక్తియుతమైన తమ యూనియన్ పాలసీని అమలు జరుపుతామనీ, జాతీయైక్యత, జాతీయనాయకుల విడుదల, జాతీయ ప్రభుత్వం, తద్వారా ప్రపంచఫాసిజాన్ని నాశనం చేయుటకై ప్రపంచ ప్రజలతో సహకారం — వీటన్నిటికొరకు తమలోపరిపూర్ణమైన ఐక్యతను సాధించాలనీ కార్మికులు ఉత్సాహాన్ని ప్రకటించారు. పాకాలలో జులై నెలాఖరున జరిగే తమ బ్రాంచి ఎన్నికలకు 7 మంది ప్రతినిధులను యెన్నుకొని తమ సెక్షన్‌లో యూనియన్ కార్యక్రమాన్ని బాగా కొనసాగించుటకు 10 మంది సభ్యులుగల కమిటీని యెన్నుకున్న తర్వాత సభ సాయంత్రం ముగిసింది.

★ కొత్తగూడెం

బొగ్గుకార్మికులకు జరిగే అన్యాయాలు

★

కొత్తగూడెం బొగ్గు కార్మికులకు న్యాయంగా రావలసిన వేతనములు యజమానులు యివ్వక, 14-5-44న తప్పుకొలతలు వేసి, జీతాలు తగ్గించియిచ్చారనీ, న్యాయంగా రావలసిన జీతం, 50% కరువుభత్యంతో సహా వెంటనే యిప్పించాలనీ—కోరుతూ 42 సంతకాలతో బొగ్గుపనివారలు నైజాం ప్రభుత్వానికి, కేంద్రప్రభుత్వానికి, హైదరాబాద్ లేబరువెల్‌ఫేర్ ఆఫీసరుకు, కంపెనీ జనరల్ మేనేజరుకు మహజరు పంపారు. దానిపై 20—5—44 న లేబర్‌ఆఫీసరు విచారణకు వచ్చి, కార్మికులను కలుసుకున్నాడు. కార్మికులు చెప్పిన మాటలవల్ల పరిస్థితులు అర్థముకానందున, కార్మికులు లేకుండానే, మేనేజరుతోకలసి గనిలోకివెళ్లి పరీక్షించాడు. తిరిగి కార్మికులు లేబరు ఆఫీసరును కలుసుకొని పర్యవసానం అడుగగా, కంపెనీ చేసే అన్యాయం తనకు తెలుసుననీ, తొందరపడి పనిమానవద్దనీ, ఇకమీద యేవిధమైన అపకారం జరుగకుండా చూస్తాననీ ఆఫీసరు సమాధానం చెప్పారు. ఉత్పత్తియదల తమకుగల దీక్షను కార్మికులు తెలియజేస్తూ, తగ్గించిన జీతాన్ని, నూటికి 50 వంతులు కరువుభత్యంతోసహా యిప్పించి పనిలోఉన్న అడ్డంకులను తొలగిస్తే, బొగ్గుఉత్పత్తిని అధికం చేయగలమని తెలియజేశారు. మేనేజరు తెలివితక్కువను, హెడ్ అండర్‌లుక్కర్, మున్షీల లంచగొండితనాన్ని దొంగతనాన్ని అరికట్టించాలనీ, యెక్కువ తొట్లను సప్లయిచేసి ఎప్పుడుతవ్విన బొగ్గును అప్పుడు పిల్లర్సు తీసివేయుటకు అవకాశంకల్పించాలనీ, స్టోమును బాగా సప్లయి చేయించాలనీకూడా కార్మికులు ఆఫీసరుతో చెప్పారు. అధికారి తిరిగివచ్చి తనిఖీచేస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

మరునాడు మరల లేబరు ఆఫీసరువచ్చి, అవసరమైన మే నాలుగోవారం తాలూకు లెక్కలు తనిఖీచేయకుండా, మే రెండవవారం లెక్కలుమాత్రం తనిఖీచేసి, అంతా సక్రమంగానే వున్నదని చెప్పాడు. మే 4 వ వారం అండరులుక్కర్ కొలతపుస్తకం, కంపెనీ పేషీటు తనిఖీ చేయమని కార్మికులు పట్టుపట్టారు, కంపెనీ అండరులుక్కరుచేసిన పొరపాటువల్ల ఆ వారంలో 700 టన్నుల బొగ్గును కొలతలో తగ్గించారనీ, అందువల్ల ఆ వారం వేతనాలు కార్మికుల కందరికీ తగ్గించారనీ లేబరు ఆఫీసరు సమాధానమిచ్చాడు; అంటే కంపెనీకి వచ్చిన నష్టాన్ని కార్మికులపై రుద్దారన్నమాట. ఆ నష్టంతో తమకెట్టి నిమిత్తం లేదనీ, మేనేజరే దాన్ని భరించాలనీ కార్మికులన్నారు. కాని లేబరు ఆఫీసరు కార్మికుల కోర్కెను త్రోసిపుచ్చి యజమానులపక్షం వహించాడు.

కాబట్టి ప్రభుత్వం వెంటనే యీ విషయములో కలుగజేసుకొని, యజమానుల అక్రమచర్యను అరికట్టి, కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చి ఉత్పత్తిని కాపాడాలి

ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌వర్కర్సు యూనియన్ శాఖలు

నెల్లూరులో మొత్తం 13 ప్రెస్సులున్నవి. కార్మికులసంఖ్య 40. ఏప్రెస్‌లో గూడా 10 మందికిమించి లేరు. వారికి రు 5 లు మొదలు రు 9 లు వరకు యిస్తారు. కొందరు యజమానులు మాత్రమే అధికధరల అలవెన్సు రు 30 లు మొదలు రు 5 లు వరకు యిస్తున్నారు. జీవితావసర పదార్థాల ధరలు విపరీతంగా పెరిగిన యీ రోజుల్లో, యింత స్వల్ప అలవెన్సులివ్వడం చాలా అన్యాయం. దీనివల్ల కొందరు కార్మికులు ప్రెస్‌పనిమాని, యితరపనులలోకి పోవలసివస్తుంది. అందువల్ల కొన్ని ప్రెస్‌లలో పనులకు ఇబ్బందిగా వున్నది. ఈ పరిస్థితుల్లో కార్మికులు గూడా తమ కర్తవ్యాన్ని జయప్రదంగా నెరవేర్చుటకు ఉత్సాహంగాలేరు.

కాగితం, సిరా, పొదుపుగా వాడుతూ, వాటిని కంట్రోలుధరలకు విరివిగా సప్లయి చేయాలని ఆందోళన చేయాలసిన బాధ్యత కార్మికులది. ఈ పరిస్థితుల్లో 8 ప్రెస్‌లనుండి 17 మంది కార్మికులు యీ నెల 10 వ తేదీని సమావేశమై యీ క్రింది నిర్ణయాలుచేస్తూ, తమ సంఘాన్ని పునరుద్ధరించడానికి వచ్చిన అందరూ సభ్యులుగాచేరి ఒక ఆర్గనైజింగు కమిటీని యేర్పాటు చేశారు.

తీర్మానాలు

(1) గాంధీజీ విడుదలకు సంతసిస్తూ, రాజకీయ సమస్యా పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి.

(2) ఏలూరు శీతారామాంజనేయ ప్రెస్ నుంచి తొలగించిన రాఘవయ్యను వెంటనే పనిలోనికి చేర్చుకోవాలి.

(3) చిట్టివలస జూట్‌మిల్లులో అరెస్టు కాబడిన కార్మికులను వెంటనే విడుదల చేయాలి.

(4) యజమానులు ఆర్థిక పరిస్థితులను గమనించి, ప్రభుత్వం నిర్ణయించిన 10 రూ. అలవెన్సు యివ్వాలి.

(5) కార్మికులు కాగితం, సిరా, మిషన్లు పొదుపుగా వాడాలి.

(6) ప్రభుత్వం కాగితం, సిరా ప్రెస్సులకు విరివిగా సప్లయిచేయాలి.

గుంటూరు

గుంటూరు స్వరాజ్యమైదానంలో 11—6—44 న ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌వర్కర్సు యూనియన్ కార్యదర్శి కామ్రేడ్ జోగారావు అధ్యక్షతక్రింద, గుంటూరు ప్రెస్‌వర్కర్ల సాధారణ సమావేశం జరిగింది.

యజమానులతో సహకారం చేసి, ప్రెస్సులలో సిరా, కాగితం వృధాచేయక, కార్మికుల జీవితభృతికి కావలసిన కరువుభత్యాన్ని సంపాదించుకోవాలని తీర్మానించారు. తర్వాత కామ్రేడ్ శ్రీకృష్ణ ఆహారసమస్యను గురించి, కార్మికులు యూనియన్‌వల్ల పొందే లాభాలను గురించి విపులంగా మాట్లాడారు.

ప్రజాశక్తి చందావివరాలు

సంవత్సరం చందా	5—0—0
అర్ధసంవత్సరం చందా	2—8—0
మూడునెలల చందా	1—4—0

బట్టల కంట్రోలుస్కీము ఎందుకు భగ్నమయింది? ★

— ఏ. యస్. ఆర్. చారి

రెండువారాలక్రితం బొంబాయిలో శ్రీరాం బట్టలమిల్లు ఉత్పత్తిని, సెక్సేరియా మిల్లు ఉత్పత్తిని, ప్రభుత్వం స్వాధీనపరచుకున్నట్లు ప్రకటింపబడింది. వీటితోబాటు, బొంబాయి - అహమ్మదాబాదు-షోలాపూర్ పట్టణాలలో 10 బట్టలమిల్లులలో తయారైన సరుకుకూడా స్వాధీనపరచుకొనబడినట్లు ప్రకటింపబడింది అంటే యికముందు శ్రీరాం, సెక్సేరియా మిల్లులు రెండూ ప్రభుత్వోద్యోగిచే నడుపబడతాయన్నమాట. వాటి ఉత్పత్తివిధానమంతా అతని అజమాయిషీక్రింద నడుస్తుందన్నమాట. మిగతా 10 మిల్లుల విషయం ఏమంటే, అవి యింతవరకు తయారుచేసినసరుకంతా ప్రభుత్వంచే అమ్మబడుతుంది. మిల్లు యజమానుల ప్రసక్తి వుండదు.

ఈ మిల్లులన్నీ కలిసి సంవత్సరానికి మొత్తం 40 కోట్ల గజాలబట్ట తయారు చేస్తున్నాయి.

ఇంతేగాక, పోలీసులు నిలవవ్యాపారస్తుల గిడ్డంగులు సోదాచేసి, మొత్తం 56 లక్షలగజాల గుడ్డను స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకంతా పూనా నగరంలో నివసించేప్రతిస్త్రీ పురుషునికి, బాలబాలికకు, అమ్మినట్లయితే ఒక్కొక్కరికి 20 గజాలచొప్పున లభిస్తుందని అంచనా వేయవచ్చు.

1943 జూన్‌లో బట్టలకంట్రోల్ స్కీము అమల్లోకి వచ్చింది. అప్పటినుంచీ ప్రభుత్వం సరుకు పై ధరల కంట్రోలుని ధించబోతున్నామనీ, మిల్లు యజమానులు ప్రభుత్వానికి సహాయం చేస్తున్నారనీ, ప్రజలు దిగులుపడనవసరంలేదనీ, ప్రకటనలు గావిస్తూవచ్చింది. కాని, ప్రజా సామాన్యం యీ కంట్రోలు విధానంవల్ల పరిస్థితులంతగా మారనట్లు తమ నిత్యానుభవంలో తెలుసుకున్నారు. ధరలు 100 కి 30 మొదలు 40 వరకు తగ్గినప్పటికీ, యుద్ధానికిపూర్వం ఉన్న ధరలకంటె 100 కి 390 చొప్పున అధికంగావున్నాయి. మిల్లులకు చేరువలో ఉన్న ప్రాంతాలకు సరుకు విరివిగానే వచ్చినప్పటికీ, దూరప్రాంతాలకు సప్లయి బహుతక్కువ.

ప్రభుత్వం మిల్లు యజమానులతో సంప్రతించి, కొన్నిరకాల బట్టకు గరిష్ఠధరలు నిర్ణయించింది. వాటినిమించి ఏ మిల్లు యజమాని సరుకును అమ్మకూడదు. ప్రతి బట్టల బేలుమీద ఖరీదు, ధర మార్కు చేయాలి. ఈ ధరను-మించి వర్తకులు మూడు రెట్లు లాభం వేసుకొని అమ్ముకోవచ్చు. కాని, ప్రతివర్తకుడు సరుకును ఒక నిర్ణీత కాలంలో అమ్మివేయాలి.

కంట్రోల్‌బోర్డులో మొత్తం 25 గురు సభ్యులుంటారు. వారిలో 20 మంది మిల్లుయజమానులు, వారి సంబంధీకులైన వర్తకుల, ప్రతినిధులు. కష్టపడి, చెమటోడ్చి బట్టను ఉత్పత్తిచేసే కార్మికులకు ప్రాతినిధ్యం ఒక్కటే, బట్టనుకొనుక్కునేఅశేషప్రజాసామాన్యానికి ప్రాతినిధ్యమేలేదు. ఇక ధరలకంట్రోలు ఉపసంఘంలోను, ఉత్పత్తి సంఘంలోను, మిల్లు యజమానులదే పూర్తిప్రాతినిధ్యం. ఈ విధంగా బయటివారి జోక్యం లేకుండా చేసుకొని, మిల్లుయజమానులు విచ్చలవిడిగా లాభాలుదోచడం ప్రారంభించారు.

మోసగాండ్ర కుయుక్తులు

కంట్రోలు నిబంధనల ప్రకారం, మిల్లుయజమాని ప్రతి బేలుమీద నిర్ణీతధరను మార్కుచేయాలి. అయితే కొందరు తమ సరుకును పూర్తిగా విడుదలచేయక, కొంత సరుకును మాత్రమే బయటికి తీశారు. ఉదాహరణకు, 700 మగ్గాలు పనిచేసే ఫ్యాక్టరీలో 500 మాత్రమే పనిచేస్తున్నాయని బుకాయించి ఆసరుకును మాత్రమే బయటికి తీసేవారు. మిగతా 200 మగ్గాలకు సంబంధించిన సరుకును దొంగమార్కెట్లో అమ్ముకోసాగారు.

మరో ఉపాయం ఉంది. ఎగుమతులపై ఎట్టి కంట్రోలులేదు. అందువల్ల మనదేశంలో విడుదలకావలసిన సరుకును సహితం ఎగుమతికి ఉద్దేశించబడినట్లు మార్కుచేసి, క్రమముంగా దాన్ని దొంగమార్కెట్టుకు చేర్చేవారు.

ఇంతేకాదు. టోకు వర్తకులకు చెందవలసిన 100కి 20 లాభంకూడా మిల్లు యజమానులేకాజేయసాగారు. తమ బంధువుల పేర్లు పెట్టి, లేదా లేనిపేర్లు సృష్టించి, వారికి తాము సరుకును అమ్మినట్లు ఎకౌంట్లు తయారుచేశారు. ఈ "దొంగ" వర్తకులు తిరిగి 100 కి 6 చొప్పున, 10 చొప్పున, లాభం వేసుకుని "అసలు" వర్తకునికి సరుకును అమ్మేవారు. 1943 లో యీ విధంగా అనేకమంది "దొంగ" వర్తకులు కొత్తగా బయల్దేరారు. దీన్ని అరికట్టడానికి, 1940, 1941, 1942 సంవత్సరాలలో బేరం యిచ్చినవారికే సరుకును అమ్మాలని ప్రభుత్వం కొత్తనిబంధన చేయవలసివచ్చింది.

మిల్లు యజమానులకు భూతలస్వర్గం

ఇవీ బట్టల కంట్రోలు స్కీముయొక్క ముఖ్య నిబంధనలు. ఇక ప్రజలకు కావలసినంత సరుకు లభించుతుందనీ, ఏమీ గాభరా పడనవసరం ఉండదనీ ప్రభుత్వం ప్రజలకు హామీ యిచ్చింది. మిల్లు యజమానులు ఈ స్కీములో పూర్తి సహకారంచేస్తున్నట్లు ప్రకటనలు గావించింది.

ఈ హామీలు, యీ ప్రకటనలు వచ్చిన కొద్దినెలలకే పైవిధంగా మిల్లులఉత్పత్తిని ప్రభుత్వం స్వాధీనంచేసుకుంది! దీన్నిబట్టి కంట్రోల్‌స్కీము పూర్తిగా విఫలమయిందని తెలుసుకోవచ్చు. మిల్లుయజమానులు దాన్ని భగ్నమొనర్చినట్లు స్పష్టమయింది.

ఏ విధంగా మిల్లుయజమానులు, పెద్ద వ్యాపారస్తులుకలిసి యీకంట్రోల్ స్కీమును భగ్నమొనరించారో చూదాం. 'టెక్స్టయిల్ ఇకవర్తకులవిషయం చూదాం. కంట్రోల్ స్కీము ప్రకారం వీరొక నిర్ణీతకాలంలో బట్టలబేళ్లను అమ్మవలసియుండగా, అలా అమ్మక దొంగ మార్కెట్లకుచేర్చి, పైగా గడువును పొడిగింపవలసిందని ఆందోళన ప్రారంభించారు. సరుకును స్వదేశసంస్థానాలకు దాటవేసి, అక్కడినుంచి రహస్యంగా అమ్మసాగారు. దొంగమార్కెట్లో ఒక్కొక్క బేలానికి పదిమంది, పన్నెండుగురు కూడా దళారీలు తయారయారు. కొన్నిసందర్భాలలో సంస్థానాధీశ్వరులే యీ దొంగవ్యాపారాన్ని సాగిస్తూ వచ్చారు.

పరిస్థితులింత దారుణంగా ఉన్నప్పుడు, టెక్స్టైల్ కంట్రోల్‌బోర్డు అధ్యక్షుడైన కృష్ణరాజఠాకర్సీ ఏమన్నాడో చూదాం.

"మిల్లులఉత్పత్తిలో సగంవరకూ ఎలాంటి లాభాలులేని స్టాండర్డుబట్టకు ప్రత్యేకించబడుతూన్న సమయంలో, యజమానులకు లాభాలొస్తున్నాయంటూ విమర్శించడం ఆశ్చర్యకరరంగా వుంది"

ఈ ప్రకటనలో ఎంత యదార్థం వుందో చూదాం. అహమ్మదాబాద్ మిల్లుయజమానులు తమ ఉత్పత్తిలో సగంవరకూ స్టాండర్డ్ బట్టకే ప్రత్యేకించినా, 1943వ సంవత్సరంలో ప్రభుత్వానికి మొత్తం 40 కోట్లు "అదనపు లాభాలపన్ను" చెల్లించారు. అంటే, మిగతా సగం ఉత్పత్తిమీద ఎంత ఎక్కువ లాభాలు సంపాదించారో ఊహించుకొనవచ్చు.

స్టాండర్డ్‌క్లాత్ ఉత్పత్తి

ఇక స్టాండర్డ్‌క్లాత్ నాటకం చూదాం. ఇందులోకూడా మిల్లు యజమానులు పైధోరణినే అవలంబించారు. ఎందువల్లనంటే, స్టాండర్డ్‌క్లాత్ ఉత్పత్తిలో అంతగా లాభాలుండవు. ఈస్కీము విఫలమైతీరుతుందని మొదటినుంచీ వీరు దేశంలో ఒక తుపాను లేవదీశారు. మరోవైపు యిది విఫలం కావడాని కెన్ని చేయాలో అన్నీ చేశారు. ఉదాహరణకు, మిల్లు యజమానులు ఒక్కొక్క రాష్ట్రానికి కొన్ని నిర్ణీతమైన బేళ్ళను పంపాలని ప్రభుత్వం ఆజ్ఞాపించింది. 1943 మే మొదలు 1944 మే వరకు బెంగాల్ రాష్ట్రానికి 8,90,00,000 గజాలబట్ట పంపవలసియుంది. అలా పంపబడినట్లు ప్రభుత్వం విచారణచేసుకొని, చూచుంది. కాని, జరిగిందేమిటి? కలకత్తాలోవున్న టెక్స్టైల్ కంట్రోలరు, బట్ట సప్లయి కావటంలేదని కంప్లెయింటు చేస్తూ వచ్చాడు. తాను టోకు వ్యాపారస్తునికి సరుకు పంపినట్లు మిల్లుయజమాని చెప్పాడు; చిల్లరవ్యాపారస్తునివద్ద సరుకు ఉన్నట్లు టోకు వర్తకుడు తెలియజేశాడు; చిల్లర వర్తకుడు ఆకాశంవైపు గుడ్లురిస్తి, సరుకు తనకు చేరనేలేదని గుట్టు బయటపెట్టాడు; సరుకంతా ఎక్కడికి మాయమైందో ఎవరూ చెప్పరు.

ఇదీ తంతు.

స్టాండర్డ్ బట్ట ఆకర్షవంతంగా లేనందున ప్రజలు దాన్ని కొనడంలేదంటూ యీ ప్రబుద్ధులే సిగ్గులేకుండా వాదించసాగారు. ఆకర్షవంతంగా చేయడానికి ఎన్ని మార్గాలులేవు?

అలా ఆకర్షవంతంగా చేస్తే వీరిని అడ్డుపెట్టేవారెవరుంటారు?

టెక్స్టయిల్ కంట్రోలు బోర్డుకు అధ్యక్షుడైన కృష్ణరాజ ఠాకర్సే ఒక షోలాపూర్ మిల్లుకు డైరెక్టరు. ఈ మిల్లులో తయారైన సరుకు సహితం ప్రభుత్వంచే స్వాధీనపరచుకొనబడిందంటే, ఎంత విచ్చలవిడిగా దొంగవ్యాపారం కొనసాగుతూందో ఊహించుకోవచ్చు.

ప్రభుత్వం దొంగవ్యాపారాన్ని అణచుటలో ప్రజాసహకారం తీసుకోటంలేదనే విషయం ఈ మిల్లుయజమానులకు చక్కగా తెలుసు. అందువల్లనేవీరింతధీమాతోకంట్రోలు స్కీమును భగ్నమొనర్చగలిగారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లుతెరచి, దొంగవ్యాపారం చేసేవారిని కఠినశిక్షకు గురిచేయాలి. దొంగవ్యాపారం చేసేవారి సహాయంతో దొంగవ్యాపారాన్ని అరికట్టడం అసాధ్యమనే విషయం గ్రహించాలి. బట్టల ఉత్పత్తికై అహోరాత్రాలు కష్టపడి చెమటోడ్చే కార్మికులయొక్క, బట్టకొనుక్కొనే ప్రజాసామాన్యంయొక్క సహకారంతో ప్రభుత్వం తన కంట్రోలుస్కీమును జయప్రదంగా నిర్వహించాలి.

★

విప్లవ జోహారులు

బాపట్లతాలూకా దేవరపల్లిలో కామ్రేడ్ తంగెళ్ల వెంకటేశ్వర్లు, మూడుమాసాల పార్టీ పరిచయంతో రౌడీపనులుమాని, పార్టీసభ్యుడయ్యాడు. గత సంవత్సరం మండి రైతురంగంలో పనిచేశాడు. ఎన్ని ఆర్థికఇబ్బందులు వచ్చినా లెక్కించక, పార్టీమీదవున్న అచంచల విశ్వాసంతోను, పార్టీజీవితం కావాలనే గట్టిపట్టుదలతోను, పనిచేసి 9 మాసాలలో సెల్ సెక్రెటరీగా అభివృద్ధయాడు. ఆరోగ్యం తవరిగాలేనప్పటికీ, కృష్ణతాలూకల మరమ్మత్తుకు పార్టీ పిలుపివ్వగానే బెజవాడ వెళ్ళి 15 రోజులు పనిచేశాడు. "పని ఎంతకష్టమైనా, ప్రాణం పోయేవరకూ పనిచేసి, ఎర్రజండా సంపాదించిగాని దేవరపల్లి చూడను" అని చెప్పాడు. 15రోజులుపనిచేసి, ఏమీచేయలేని స్థితిలో పార్టీఉత్తర్వుతో ఎర్రజండా సంపాదించానే గర్వంతో 3 తేదీ రాత్రికి యింటికి జేరాడు. యింటికి వచ్చినప్పటినుండి జ్వరం, తలనొప్పి, మూడుపోటులతో 5 రోజులు బాధపడి, చివరి 2 గంటలు పార్టీనిగూర్చి మాట్లాడుతూ, 8వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు ప్రాణంవిడిచాడు. సాయంత్రం 6 గంటలకు దేవరపల్లి, పర్చూరు, పాలపరు కామ్రేడ్సు ఎర్రజెండాలతో కామ్రేడ్ శవాన్ని తీసుకవెళ్ళి సమాధిచేసి, జండాపాటతో శాల్యూట్‌చేసి, కామ్రేడ్ వెంకటేశ్వర్లుకు పార్టీఅంటేవున్న అచంచల విశ్వాసాన్ని, పట్టుదల, కార్యదీక్ష, శాంతస్వభావాలను ఎలా అలవరచుకోవాలో ఆలోచించుకొంటూ యిండ్లకు చేరారు. పట్టుదల, దీక్షతో పార్టీకి ప్రజలకు సంవత్సరకాలం సేవచేసి మరణించిన కామ్రేడ్ వెంకటేశ్వర్లు కివే మా విప్లవ జోహారులు.

కోడేరు బ్యాంకు కాలవ మరమ్మతు

★

అన్ని వర్గాలు, అన్ని పక్షాలు కదిలివచ్చారు

— టి. కె. రామస్వామి

పశ్చిమగోదావరిజిల్లాలో కోడేరు బ్యాంకు కెనాల్ మరమ్మతులేక, మెరకవేసింది. సుమారు 30 గ్రామాల్లలో 75 వేల యకరాల భూమికి నీటినప్లయిలేక, మొదటి పంటలోనే దెబ్బతింటూంది. ఇదిగాక, దాళవాపంటలో 20 వేల యకరాల పంట పాడవుతోంది. అనగా ప్రతిసంవత్సరం 2 లక్షల బస్తాల ధాన్యం రెండుపంటలలోను నష్టమవుతోంది.

కరువుకాటకాలనుంచి ప్రజల్ని రక్షించ వలసిన యీ తరుణంలో, అధికాహారోత్పత్తి యొక్క అవసరాన్ని నర్సాపురం తాలూకా రైతుసంఘం గుర్తించి, కాల్వ మరమ్మతుకు పూనుకొంది. కాంగ్రెసువాదులు, జస్టిసుపార్టీ వారు, పెద్దరైతులు, చిన్నరైతులు, - అంతా కదిలారు. రైతుసంఘం తరఫున శ్రీగొడవర్తి సుబ్బన్నగారు (కాంగ్రెసు) యూనిటు 13 రు. 13 చొప్పున టెండరు దాఖలుచేశారు. ఇతర కంట్రాక్టర్లుకూడా టెండర్లు దాఖలు చేశారు. ప్రభుత్వం సగం మరమ్మతు రైతు సంఘానికి, సగం కంట్రాక్టర్లకు, యిచ్చింది. 3-5-44 న టెండర్లు ఆమోదించబడినాయి.

మే 15 తేదీనాటికి రైతుసంఘం కొద్ది మంది కూలీలనుమాత్రమేసమీకరించగల్గింది. వెంటనే రైతు ప్రచారకులు బయల్దేరి, గ్రామ గ్రామంలోను ప్రచారంచేశారు. రైతులు క్రమంగా కూలీలను కాల్వపనికి పంప నారంభించారు.

ఈలోగా సూపరింటుండింగ్ ఇంజనీరుగారు తనిఖీకివచ్చి, ఎక్కువమంది కూలీలు లేక పోవడంచూచి, రెండవభాగాన్ని యితర కంట్రాక్టరుల కియడానికి నిర్ణయించారు. కంట్రాక్టర్లు, యీ భాగాన్ని తవ్వించలేమని, 4 వ భాగం మాత్రం పూర్తిచేయాలని, ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కాని, కాల్వ యావత్తుగా త్రవ్వితేనేగాని లాభం ఉండదు.

పరిస్థితులు విషమించేటట్లు ఉన్నాయి. వెంటనే రైతుప్రచారకులు గ్రామాలలో ప్రచారంచేసి, కూలీలకొరకు పిలుపు ఇచ్చారు. మే 21వ తేదీనాటికి కూలీలసంఖ్య 60 నుండి 150 కి హెచ్చింది. మరునాడు 200 దాటింది. మూడవనాడు 260 అయింది.

తవ్వుపని జోరుగా సాగుతోంది. అధికారులు తమ ఉద్దేశాన్ని మార్చుకొన సాగారు.

అధికారోత్పత్తికి రైతుసంఘం, కూలీ సంఘంచేసే కృషిని గురించి, ప్రజల్ని కరువు బాధనుండి రక్షించడానికి రైతులు - కూలీలు నిర్వహించవలసిన బాధ్యతల్ని గురించి, పాటలరూపంలోను, బుర్రకథల రూపంలోను ప్రచారకులు చెప్పారు.

కాలవ పొడుగునా ఎక్కడచూచినా ఎర్ర జెండాలే. ఎక్కడవిన్నా కూలీ-రైతునినాదాలే.

తవ్వుపని పూర్తికా వొచ్చింది. కాని, అనుకున్న అంచనాకంటె ఒకరోజు ఆలస్య మయేలావుంది. అందువల్ల కాలువకు అడ్డు కట్టవేయించాలని ఆలోచిస్తున్నారు డిపార్టు మెంటువారు. ఈ విషయం తెలుసుకొని, కామ్రేడ్ రాఘవం ఇలా అన్నాడు: "మన మూలకంగా నీరువదలడం ఒక్కరోజుకాదు గదా, ఒక్కగంటకూడా ఆలస్యంకాకూడదు." వెంటనే మేస్త్రీలు తమతమ గ్రామాలకుపోయి కూలీలను తీసుకొచ్చారు. జిల్లా యువజన సంఘకార్యదర్శి పారపుచ్చుకొని, మరో 12 గురితో తవ్వుపనికి దిగాడు. జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు కమ్యూనిస్టుపార్టీ నాయకులు పనిలో ప్రవేశించారు.

కూలీలలో ఉత్సాహం యినుమడించిది. రెండవభాగం తవ్వుపనిని నకాలంలో పూర్తి చేసి 29 వ తేదీనాటికి వొప్పజెప్పారు.

సబుడివిజనల్ ఆఫీసరు, ఓవరుసీయరు, తవ్వుపని జరుగుతూండగా తనిఖీకి వచ్చారు. జండాలు, పాటలు, నినాదాలు చూచి విస్మయం పొందారు అందరూ.

29 వ తేదీనాటికి తవ్వుపని పూర్తిఅయినా కూలీలు తండ్లుతీసి వేయరేమోనను గాభరాతో అధికార్లు 30వ తేదీ ఉదయానికి 140 మంది కూలీలను తీసుకొచ్చారు. కాని, అనాటిరాత్రే కూలీలు పట్టుదలతో పనిచేసి, ఉదయం 9 గంటలయేసరికి తండ్లు పూర్తిగా తీసివేశారు. ఇక అదనపు కూలీలెందుకు?

పూర్తిచేయలేమనుకున్న రెండవ భాగపు పనిపూర్తిఅయింది. కాని నాల్గవది నకాలంలో పూర్తిఅయేలాలేదు. అక్కడి కూలీలలో మూడువంతులు పేదరైతులు — వ్యవసాయ కూలీలు ఉప్పర్లు. పైగా వ్యవసాయ తరుణం కావడంవల్ల త్వరగా వెళ్ళిపోయి నారుమళ్ళు తవ్వుకుందామని తొందరపడుతున్నారు. ప్రచారకదళాలు మళ్ళీ రంగంలో ప్రవేశించాయి. కూలీలందరూ తిరిగి తవ్వుపనికి దిగారు. తవ్వు పూర్తికావడానికి రాత్రులు కూడా కష్టపడి పనిచేశారు.

పని పూర్తయింది.

పనిచేసిన రోజుల్లో రైతుసంఘం కూలీలకు కిరసనాయిలు, పుల్లలు సప్లయిచేసింది. "ఈ పనిని సంఘంవారు తీసుకున్నట్లు ముందుగా తెలిస్తే, మేమింతకాలం ఆగేవారమా?" అని కూలీలు అన్నారు. కూలీ సంఘాలు పెట్టడానికి తమ తమ గ్రామాలకు ప్రచారకుల్ని ఆహ్వానించారు. వారికిచ్చిన ఎర్రజండాలను తిరిగి యిమ్మని అడిగితే, "మా డబ్బులోనుంచి తీసుకోండిగాని, మేం జండాలనీయం" అని పట్టుపట్టారు.

రైతుల్లో కూడా తవ్వుపని పూర్తికావాలని పట్టుపట్టారు. వేమవరం గ్రామంలో శ్రీ శివరామయ్యగారు స్వయంగా రైతుల్లో ప్రచారంచేసి, 100 మంది కూలీలను పనికిపంపించారు. నడుపూడి గూడా యీ గ్రామంతో సరితూగింది. రెండవభాగంపనికి రైతుసంఘ కార్యాలయం ముత్యాలవారి పాలెంలో, ఒక బీదరైతు యింట్లో పెట్టారు. రైతువర్కర్లు, పార్టీసభ్యులు పడుతూన్న కష్టం స్వయంగా చూచి ఆపేదరైతు ఆశ్చర్యపోయాడు. చివరి రోజున తిరిగివస్తూ, ఆఫీసుపైవున్న జండాను తీయబోయేసరికి అతడు అడ్డువచ్చి, "మా యింటిమీది రైతుజండాను తీయడానికి వీల్లేదు; కావలిస్తే ఖరీదుయిస్తాను" అంటూ జండాను ఉంచుకున్నాడు.

ప్రజాసేవలో ★

అందరూ ఏకంకాగలరు

ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం జొన్నపాడు (కృష్ణాజిల్లా)లో ఘోరమైన అగ్ని ప్రమాదం జరిగింది. తాటాకు పాకలతో క్రిక్కిరిసివున్న ప్రాంతంలో ఒక గుడిసె నిప్పంటుకుంది. కొద్దిసేపట్లో చుట్టుప్రక్కల కొంపలంటుకున్నాయి. దగ్గరకెవ్వరూ వెళ్ళలేకపోయారు. దగ్గరలోనే నువ్వులగానుగ ఆడే ఇల్లుంది. దానిక్కూడా నిప్పంటుకుంది. అక్కడ నిలవున్న నూనెడబ్బాల నంటుకొని, మంటలు మరింత చెలరేగాయి. 55 యిళ్ళు మంటలపాలయాయి. సాయంత్రం 4½ గం॥లకు మంటలు కొంత స్వాధీనంలోకివచ్చాయి. ఇంతలో ఫైరింజన్లు వచ్చాయి.

తగులబడ్డ 55 ఇళ్ళల్లో 22 పెంకుటిళ్ళు. 40 పుట్ల ధాన్యం, 16 బస్తాల నువ్వులు, 12 డబ్బాల నువ్వునూనె, రు. 2000 విలువగల నోట్లు కాలిపోయాయి. సుమారు లక్ష రూపాయీల నష్టం వుంటుందనుకుంటున్నారు.

మంటలనుండి సామాన్లను భద్రపరచడం లోను, మంటల నార్పడానికి ప్రయత్నించడంలోను స్థానిక కమ్యూనిస్టులు మొదటినుంచి తీవ్రంగా కృషిచేశారు. జాతీయ యువజన సంఘంవారుకూడా కొందరు పనిచేశారు. 16 పుట్ల ధాన్యంతో వున్న కొట్లు తగులబడిపోతుండడం కామ్రేడ్సు చూచి సాహసించి వెళ్లి మంటలనార్పి 8 పుట్లు ధాన్యం కాపాడారు.

మంటల నార్పిన దగ్గరనుంచి నష్టపడిన వారికి తగు సహాయం యేర్పాటు చేయడానికి అహోరాత్రులు పాటుబడసాగారు. మశూచి రోగాలతోవున్న నాలుగు కుటుంబాలకు అకు, వాసాలు వెంటనే సప్లయిచేయించారు. వారు ఇళ్ళునేసుకున్నారు. రైతు సంఘం తరఫున రంగారెడ్డి, గుడివాడలోని బ్రిహ్మానందరెడ్డిగారు సహాయ సౌకర్యాలనుగురించి కలక్టరు వద్దకు వెళ్లితే "తలకొక పది వాసాలు ఇవ్వగలం. మిగతాది చందాలద్వారా మీరే ఏర్పాటు చేయండ"ని సలహాఇచ్చారు. దానిపై "జొన్నపాడు గ్రామ రిలీఫ్‌కమిటీ" ని ఏర్పరిచారు. దీనిలో గ్రామపెత్తందార్లు 8 మంది, తాలూకా రైతుసంఘ అధ్యక్షులు రంగారెడ్డి, పోటీ రైతుసంఘ కార్యదర్శి ఉన్నారు.

దీనికింద తాటాకు సప్లయి కమిటీ, కలప కమిటీ, చందాలకమిటీ, అని ఏర్పాటుచేశారు. వీటిల్లోకూడా పెత్తందార్లు, కమ్యూనిస్టులు, పోటీ రైతుసంఘంవారు ఉన్నారు. జొన్నపాడులోను, గుడివాడ మిల్లు యజమానుల నుండి, ఇరుగుపొరుగు గ్రామాలనుండి చురుకుగా చందాలు వసూలు చేస్తున్నారు. కాలవనుంచి 150 బళ్ళమట్టిని బయటవేశారు బట్టలవుసర మున్నవారికి బట్టలు సప్లయిచేసే ప్రయత్నాలుకూడా చేస్తున్నారు.

చాలమంది గ్రామ పెత్తందార్లు ఒకపూట, రెండేసి పూటలు భోజనాలు పెట్టారు.

★

గ్రంథాలయములు - ప్రభుత్వ విరాళములు

'ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ' కార్య శ్రీ పాతూరి నాగభూషణంగారు ఇలా ప్రకటిస్తున్నారు:

1944-45 సం॥నకు మదరాసు ప్రభుత్వమువారు గ్రంథాలయములకు రు 55,000 విరాళమునిచ్చుటకు తీర్మానించుకున్న విషయము పత్రికాముఖమున గ్రంథాలయములనిర్వాహకులు చూచియుందురు. ఇందు రు 30,000-0-0 పంచాయతీబోర్డు గ్రంథాలయములకును రు 25,000-0-0 జిల్లాబోర్డు, మునిసిపాలిటీ, కోఆపరేటివ్, ప్రయివేటు (రిజిస్టర్డు) గ్రంథాలయములకును పంచిపెట్టబడును. ఈవిరాళముల పొందదలచిన గ్రంథాలయములు దిగువ అంశములను నెరవేర్చవలెను.

ప్రయివేటు గ్రంథాలయములు

1. 1860 వ సం॥ XXI వ ఆక్టు ననుసరించిగ్రంథాలయములురిజిష్టరై యుండవలెను.

2. భవనములు, కుర్చీలు, బెంచీలు, మున్నగు ఉపకరణములు, సిబ్బంది గ్రంథాలయములవారే సమకూర్చుకొనవలెను.

3. గ్రంథాలయములో అన్నిజాతులవారికి ప్రవేశార్హత యుండవలెను. ఇవిఅన్నిజాతులు రాదగిన ప్రదేశములలో నుండవలెను.

4. ప్రభుత్వము వారొసంగు మొత్తమునకు తగ్గనిమొత్తమును తాముకూడా వెచ్చించుటకు గ్రంథాలయములవారు సంసిద్ధులు కావలెను. (ఈసూత్రము పంచాయితీబోర్డు గ్రంథాలయములకు వర్తించదు.)

5. గ్రంథాలయముకు కొనవలసిన పుస్తకముల జాబితాలను ఆయా జిల్లా విద్యాశాఖాధికారులంగీకరించవలెను.

6. పుస్తకములపట్టీలను ఎప్పటికప్పుడు సిద్ధముగనుంచి వీనిని గ్రంథాలయముల తనిఖీ నిమిత్తము అప్పుడప్పుడు దరుదెంచు యుద్యోగులు కోరినప్పుడెల్ల చూపవలెను.

జిల్లాబోర్డులు, మునిసిపాలిటీలు, పంచాయితీబోర్డులు గ్రాంటు దరఖాస్తులను ఆయా జిల్లా విద్యాశాఖాధికారులద్వారా పంపుకొనవలెను. ప్రయివేటు (రిజిస్టర్డు) గ్రంథాలయములు తమ దరఖాస్తులను తమ తమ జిల్లా బోర్డులు, లేక మునిసిపాలిటీలద్వారా పంపుకొనవలెను. కో-ఆపరేటివ్ గ్రంథాలయములు తమ తమ జిల్లా కో-ఆపరేటివ్ రిజిస్ట్రారుల ద్వారా దరఖాస్తులు పెట్టుకొనవచ్చును.

దరఖాస్తులలో తెలుపవలసిన అంశములు

1. గ్రంథాలయమున కగు సంవత్సర ఖర్చులు.

2. లోగడ సం॥లలో గ్రాంటు నేమైన పొందియున్నఅందుండి వెచ్చించిన మొత్తం.

3. పైగ్రాంటులలో ఖర్చుచేయని మొత్తముల నిలువ.

4. తమఆదాయమునుండి వెచ్చించదలచుకొన్న మొత్తము (ఈ వివరమును పంచాయితీబోర్డు గ్రంథాలయాలు తెలుపనక్కరలేదు.)

5. ప్రభుత్వమువారినికోరదలచినమొత్తం.

ఈ దరఖాస్తులు జిల్లా విద్యాశాఖాధికారుల సలహాతో జులై 10వ తేదీ లోపల విద్యాశాఖ డైరక్టరుగారికి మదరాసు చేరవలసియున్నందున జూన్ 25వ తేదీ లోపల గ్రంథాలయములవారందరు తమ దరఖాస్తులను పంపుకొను విషయమై శ్రద్ధవహింపకోరుచున్నాను.

★ ఆంధ్రలో ఆహారసమస్య ★

గుంటూరుజిల్లా ఆహారకమిటీ నిర్మాణానికి ఆహ్వానం

జిల్లాలోప్రజల ప్రాథమికావసరమయిన ఆహారసప్లయి విషయం ఆందోళనకరంగా వున్నది. అదనం పండినప్రాంతాలలో కమాండీరింగు అవకతవకలు, కొరత ప్రాంతాలలో బియ్యం కరువు, బస్తీలలో రేషనింగు లోటుపాట్లు, అధిక లాభాలకోసం వర్తకుల కుతంత్రాలు - యిదీ నేటిపరిస్థితి.

జిల్లా దాదాపు స్వయంపోషకం. తెనాలి, రేపల్లెతాలూకాలు అదనం పండించుతాయి. గుంటూరు, బాపట్ల తాలూకాలు బొటాబొటిగా సర్దుకుంటాయి. మిగతా మెట్టతాలూకాలన్నీ కొరతప్రాంతాలు. యుద్ధసమయం అవకాశంగా తీసుకొని విపరీత లాభాపేక్షతో సరుకు కొని మార్కెటులో అమ్మడంవలన ప్రజలు అమిత కష్టాలపాలైనారు. ఇంతలోనే ప్రభుత్వం ధాన్యం, బియ్యంలకు కంట్రోలుపెట్టడం రేషనింగు ప్రవేశపెట్టడం జరిగింది. ఈ కంట్రోలు, రేషనింగులవల్ల ప్రజలకు మేలు కలుగజేస్తూ, ఉన్న సప్లయిలను ఉమ్మడిగా సర్దుకొని కరువు కాటకాలకు దూరం కావాలంటే యీ దిగువబాధ్యతలు నెరవేర్చాలి:

1. అన్నిచోట్లా ఆహారకమిటీలు ఏర్పరచి, ఇప్పటికే ఉన్న అహారకమిటీల పనిని సమన్వయం చేసుకుంటూ, ప్రజల నిత్యావసరాలైన ఆహారం, బట్టలు, కట్టెలు, కిరసనాయిలు వగయిరా ప్రజలకు అందుబాటు చేయాలి.

2. మెట్ట, మాగాణి ప్రాంతాలలో అవసరాలకు మించి అదనం పండించిన రైతులకు నచ్చచెప్పి బస్తీల్లోని, కరువుప్రాంతాలలోని, ప్రజల పోషణనిమిత్తం వారి ధాన్యం కంట్రోలుధరకు అమ్మేలా చేయాలి.

3. కొరతప్రాంతాలకు సప్లయి అయిన బియ్యం తదితర ధాన్యాలు పొదుపుగా ప్రజావసరాలు తీర్చునట్లు పంచిపెట్టాలి.

4. బస్తీలలో రేషనింగు అమలుపెట్టుటలో గల లోపాలను సవరించుకుంటూ, వచ్చిన సప్లయిలు సక్రమ వినియోగం పొందునట్లు చేయాలి.

5. కంట్రోలు, రేషనింగు, కమాండీరింగు అమలుపరచుటలో ప్రభుత్వ అవకతవకలను ఎత్తిచూపి, సక్రమంగా అమలు జరుగుటకు సహకారమూ, ఆందోళనా చెయ్యాలి.

6. కరువుకాటకాలకు ప్రజలు అహుతి అవుతూంటే, అధికలాభాపేక్ష అక్రమమని వర్తకులకు విజ్ఞప్తిచేసి, దొంగనిలవలను, దొంగమార్కెట్‌ను అరికట్టాలి. ఈ విజ్ఞప్తిని పాటించని ప్రజా విరోధులను వలంటీరుదళ సాయంతో బట్టబయలుచేయాలి.

7. గోరుచుట్టుపై రోకటిపోటులాగా తిండి చాలని ప్రజలను మలేరియా, మశూచి మొదలయిన అంటువ్యాధులు వెంటాడుతున్నాయి. ఒంగోలు తాలూకాలో ప్రజలు మలేరియాతో విపరీతంగా బాధపడుతున్నారు. ఇటువంటి అంటువ్యాధులనుండి ప్రజలను రక్షించాలి.

8. ఈనాటి కరువుకాలంలో అధికాహారోత్పత్తి అవసరం గుర్తింపచేసి అందుకు అవసరమయినచర్యలు తీసుకోవాలి.

9. జిల్లాలో ఆహారోత్పత్తి ఎంతో పరిశీలించి, జిల్లాకు కావలసిన ఎగుమతిదిగుమతులను సక్రమ పద్ధతుల్లో సాగించాలి.

సోదరులారా!

బెంగాలు, అస్సాం, ఒరిస్సా, మలబారు, రాయలసీమలనుండి కరువు వార్తలు వింటున్నాం. ఈ భయంకర పరిస్థితులకే మనం బలిగాకుండా కాపాడుకోవాలి. మనప్రజలను నానాఅగచాట్లనుండి తప్పించాలంటే పై బాధ్యతలను నెరవేర్చుకోవాలి. ఇందుకు పలుచోట్ల పరిస్థితులను సమన్వయంచేసి పనిచేయగల జిల్లా ఆహారకమిటీ అత్యంతవసరమనిభావించుతూ, అటువంటికమిటీ నియామకానికై జిల్లాలోగలవివిధపక్షాల, తాలూకాల, ప్రతినిధుల సభను జూన్ 25 న, సాయంత్రం 5 గంటలకు గుంటూరు టౌనుహాలులో ఏర్పరచ నిశ్చయించుకున్నాం. ఇందుకు ఇదివరకే ఏర్పడియున్న అహారకమిటీలు, 25 వ తేదీకి ముందు ఏర్పరచే కమిటీలు, ఇతర ప్రజా సంస్థలు, అభిమానులు, ప్రతినిధులను పంపి తోడ్పడప్రార్థన.

ఇట్లు,

యస్. వి. యల్. నరశింహం,
బి. ఏ., బి. యల్.
(ప్రధాన కార్యదర్శి)

యం. రాధాకృష్ణ, యం. ఏ.
(సహాయ కార్యదర్శి)

గుంటూరు పట్టణ ఆహారకమిటీ.

కృష్ణాజిల్లాలోని పరిస్థితులు

మునగాల

మునగాల ఎస్టేటు (కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా) తరుగు ప్రాంతం. జనాభా సుమారు 25 వేలు. ప్రజల అవసరాలకు సంవత్సరానికి సుమారు 30,000 బస్తాల బియ్యం కావాలి. కాని అక్కడ పండే బియ్యం, జొన్నలు మొదలయినవన్నీ కలుపుతే 18,000 మాత్రమే. జొన్నలు మొదలయినవాటితో కాలక్షేపం చేసుకొందామన్నా ఇంకా 12,000 బస్తాల బియ్యం దిగుమతి అవసరం. అక్కడి పరిస్థితులను గురించి కె. వి. నరసింహరావుగారు యిలా వ్రాస్తున్నారు:

"మునగాల ఎస్టేటుకి దగ్గరలోఉన్న మార్కెట్టు జగ్గయ్యపేట(24మైళ్లు)మాత్రమే. అక్కడికివెళ్ళాలంటే మధ్యలోనున్న నైజాం ప్రదేశం దాటివెళ్ళాలి. దారిలో నైజాం కస్టమ్సు డిపార్టుమెంటువారి ప్రతిబంధకాలెన్నో ఉంటాయి. కాబట్టి వ్యక్తిగతంగా జగ్గయ్యపేటకు వెళ్ళి తెచ్చుకోవడం అసాధ్యమవుతోంది. ప్రభుత్వం దిగుమతులకు సరియయిన సౌకర్యాలు చేయలేదు. ప్రభుత్వం నిర్ణయించిన కోటా బియ్యాన్నికూడా వర్తకులద్వారానే సప్లయి చేయించజూస్తున్నారు. దానితో ప్రజలు స్థానికవర్తకుల చేతుల్లో చిక్కుకొన్నారు. వర్తకులు అధికలాభాల కోసం ఎగబడడం వేరే చెప్పవలసినవిషయం కాదు. ప్రజలకోసం ఉద్దేశింపబడిన ఈ బియ్యాన్ని దొంగమార్కెటుకు పంపుతున్నారు వర్తకులు.

నడిగూడెంలో ఒక కో-ఆపరేటివ్‌స్టోర్సు ఉంది. 1½ సంవత్సరాలనుంచి ఇది ప్రజలకెంతో ఉపయోగ పడుతూంది. ఈస్టోర్సు వారు తమకువచ్చే బియ్యం రూపాయికిదాదాపు 4 శేర్లు చొప్పున అమ్ముతున్నారు. ఈ స్టోర్సు అందుబాటులో లేని ప్రజలకు వర్తకులు 3 శేర్లు 2¾ శేర్లు అమ్ముతున్నారు. స్టోర్సులో బియ్యం అయిపోగానే 2¼ శేర్లుకూడా అమ్ముతున్నారు.

ఈ విషమ పరిస్థితుల్ని ప్రభుత్వం అరికట్టాలి. నడిగూడెం స్టోరును అభివృద్ధిచేసి, దానిక్రింద బ్రాంచీలనుస్థాపించి వాటిద్వారానే బియ్యం దిగుమతి, సరఫరాలను సాగించాలి. అప్పుడే మునగాలలోని ఆహారసమస్య చక్కబడగలదు.

★

నూజివీడు తాలూకాలో

నూజివీడు తాలూకా (కృష్ణాజిల్లా) లో కూడ పరిస్థితులు ఆందోళనకరంగాఉన్నాయి. తాలూకాలో ఆహారపదార్థాలు సరిపోవడంలేదు. గన్నవరం తాలూకా వీరపల్లి ఫిర్కా నుండి, గుడివాడ తాలూకా నుండి, ధాన్యంగాని, బియ్యంగాని, తెచ్చుకోవడంమామూలు. నూజివీడు పట్టణప్రజలకుగాని, చుట్టుప్రక్కల గ్రామాలకుగాని, 125 నుండి 150 వస్తాల వరకు బియ్యంకావాలి. ధాన్యంధర కంట్రోలు ఆమేవరకు నూజివీడు వర్తకులు బస్తా రు. 33 లకు అమ్మేవారు. కంట్రోలుధరలు ప్రకటించిన తరువాత కూడా పెచ్చుధరలకే అమ్ముతూన్నారు. అంతేకాకుండా మిల్లులు మూసివేసి ధరల కంట్రోలును భగ్నంచేయజూస్తున్నారు. ధాన్యం కంట్రోలు ధరకు దొరకటంలేదనిచెప్పి కొద్దిరోజుల క్రిందట ఒకమిల్లు మూసివేశాడు. ఒక వారం రోజులకేస్టాకుంది-అది అయిపోగానే మిల్లు మూసివేస్తామని మరో మిల్లువాళ్లు బెదిరిస్తున్నారు. ఈ దురాశాపరులఆటలను అరికట్టకపోతే తాలూకా పరిస్థితులు ఇంకా విషమించక తప్పదు. ధరల కంట్రోలును జయప్రదం చేయాలి. ఇందుకు ప్రభుత్వం గన్నవరం, గుడివాడ తాలూకాలనుండి ధాన్యం సప్లయిచేయించి, నూజివీడులోని మిల్లులు ఆడేటట్లు చేయాలి. అవసరమయితే మిల్లులను కమాండీరుచేసి, ప్రభుత్వమే వాటిని నడపాలి. నూజివీడు మిల్లుల్లోనే బియ్యం చేయిస్తే మరో ప్రయోజనం ఉంది. గుడివాడ నుంచి బియ్యం తెప్పించాలంటే కిరాయి ఖర్చులతో బస్తా ఎక్కువ ధరకు అమ్మవలసివస్తుంది. నూజివీడు మిల్లుల్లోనే బియ్యం ఆడిస్తే ఇది తప్పుతుంది. గతమాసం 29 వ తేదీని తాలూకా రైతుసంఘ కార్యదర్శి డిప్యూటీకలెక్టరువద్దకువెళ్ళి ఈ విషయం మాట్లాడారు. వారు దీనిని గురించి తగు ప్రయత్నం చేస్తానన్నారు.

కృష్ణాజిల్లాలో ధాన్యం, బియ్యం ధరల పెరుగుదల

★

జిల్లా కలెక్టరుగారి వుత్తరువు

క్రిందటినెల 19 వ తేదీని నిర్ణయించిన ధరలను రద్దుచేస్తూ కృష్ణా జిల్లాకలక్టరుగారు ధాన్యానికీ, బియ్యానికీ, క్రొత్తగా ధరలు నిర్ణయిస్తూ ఈనెల 8 వ తేదీన ఒక ప్రకటన చేశారు.

ధాన్యం ధరలు (సంచితో)

మొదటిరకం: కిచిడి, ఢిల్లీభోగాలు,	ఇంపీరియలు మణుగు	166 పౌ॥ బస్తా
వంకసన్నం, కాటుకలు	1 కి రు. 5-15-0	రు. 11-15-8
రెండవరకం: కుసుమ, అక్కుళ్లు,		
కొణామణి, రామసాగరం	రు. 5-12-0	రు. 11-9-7

బియ్యం ధరలు (సంచితో) మణుగు 1కి

మొదటిరకం: కిచిడి, ఢిల్లీభోగాలు,	ఉప్పుడుబియ్యం	పచ్చిబియ్యం
వంకసన్నం	రు. 8-7-3	రు. 8-5-3
రెండవరకం: కుసుమ, అక్కుళ్లు,		
కొణామణి, రామసాగరం	రు. 8-3-3	రు. 8-1-3

ఈ ధరల పెరుగుదల రైతుసంఘాల ఆందోళన ఫలితమేనని చెప్పాలి. గత మాసం బందరులో జిల్లా కమర్షియల్ టాక్సు ఆఫీసరు అధ్యక్షతక్రింద కృష్ణాజిల్లా ఫుడ్‌కౌన్సిల్ సమావేశమైనప్పుడు కామ్రేడ్ కాట్రగడ్డ రాజగోపాలరావు (కృష్ణా జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి) గావించిన సూచన ఏకగ్రీవంగా ఆమోదింపబడి యిప్పుడు కలెక్టరుచే అంగీకరింపబడింది.

ఆంధ్రలో ఆహారసమస్య

ప్రజల సహకారంతో పరిస్థితులు సరిదిద్దగలరు

అధికారులు, ప్రజలు, పరస్పర సహకారంతో పనిచేస్తే దొంగవ్యాపారుల పనిపట్టి, ఆహారపరిస్థితులను చక్కబరచడం సులభసాధ్యం. ఇందుకు నందిగామతాలూకానిదర్శనం. తాలూకాలో వివిధప్రాంతాలకు ఎంతబియ్యం వస్తూంది, ప్రజలకు సప్లయిఎలాసాగుతూంది, చర్చించడానికి గతమాసం 27వ తేదీని రైతుసంఘ ప్రతినిధులు తాలూకా తహసీల్దారును కలుసుకున్నారు. ఈ సంభాషణ ఫలితంగా తేటంతేమంటే — రైతుసంఘ ప్రతినిధులను గ్రామాల్లోకివెళ్లి, నిల్వవున్న ధాన్యంకాక ఇంకా ఎన్నిబస్తాలు రోజుకు కావాలో లెక్కలు తెలుపవలసిందని తహసీల్దారుకోరారు. ఏయేవర్తకులకు లైసెన్సులిస్తే ప్రజలకు సక్రమంగా బియ్యంఅందగలవో తెలుసుకోవాలన్నాడు. రైతుసంఘ ప్రతినిధులు నందిగామలో విచారణచేయగా వర్తకులు సాయంత్రం 7 దాటితే కూలీలకు బియ్యం ఇవ్వటంలేదని తెలిసింది. ఈ అక్రమం వెంటనే అరికట్టబడింది.

అనంతసాగరం జనాభా 2500. 12 గురు వర్తకులకు లైసెన్సులున్నాయి. 1 నెల 10 రోజులకు 140 బస్తాల బియ్యం సప్లయి అవుతూంది. కాని వర్తకులు ప్రజలకు సరిగా బియ్యం అందజేయడంలేదని వందమంది రైతులు కూలీలు మాతో చెప్పారు. షాహుకార్లను అడుగగా అంతా సరిగానే ఉందని దబాయించారు. ఇంకా విచారణ చేయగా 7 గురు వర్తకులు ఒక మాదిరిగా అమ్ముతున్నారనీ, 5 గురు సరిగా అమ్మడం లేదని తేలింది. ఈ 5 గురికి లైసెన్సు రద్దు చేయించాలని ప్రజలచేత తహసీల్దారుకు మహజరు పెట్టించాము. ప్రజల కోరికను నెరవేరుస్తానని తహశీల్దారు వాగ్దానంచేశారు.

కవగపాడు గ్రామంలో ఫ్యాక్టరీలో 4 బస్తాలబియ్యం తీసుకోడానికి గతమాసం 25వ తేదీని తహసీల్దారు ఒక వర్తకునికి పర్మిట్ ఇచ్చారు. అందుకోసం వర్తకుడు వెళ్ళగా ఫ్యాక్టరీ యజమాని బస్తా రు. 27-8-6 అన్నాడు. (బజారు ధర రు. 26-8-6.) ఆసమయానికే అటు బస్సులో వచ్చిన తహశీల్దారుతో ఈ విషయం చెప్పగా, ఆయన ఫ్యాక్టరీలోనికివచ్చి విచారించాడు. ఫ్యాక్టరీ యజమాని హోల్‌సేల్ లైసెన్సు రద్దుచేసి,మరోవర్తకునికి ఇచ్చాడు. ఈచర్యల ఫలితంగా నందిగామలో వర్తకులు సరిగా అమ్ముతున్నారు.

కృష్ణాజిల్లా కలెక్టరు ఉత్తరువు

బందరు, బెజవాడ, గుడివాడ నగరాల్లో యీ క్రింది ఉదహరించబడ్డ కంట్రోలు రేట్ల కుమించి బియ్యమును వర్తకులు అమ్మిన యెడల 3 సంవత్సరాల శిక్షగాని, జరిమానా గాని లేక రెండూగాని విధింప బడుతుందని క్రిష్ణాజిల్లా కలెక్టరు ఆర్డరు జారీచేశారు.

చిల్లరగా జిల్లాలో అమలులోనున్న శేరు 1కి.

	కిచిడీ	ఢిల్లీభోగాలు	రామసాగరం	అక్కుళ్లు, కుసుమ, కొనామణి
1. దంపుడు బియ్యం	0—4—2	0—4—1	0—4—0	0—3—11
2. ఉప్పుడు బియ్యం	0-3-11	0-3-11	0-3-10	0—3—10
3. పచ్చి బియ్యం	0-3-11	0-3-10	0—3—9	0—3—9

ఏలూరు ఆహారకమిటీ

ఏలూరు పట్టణ ఆహారకమిటీ ఈ నెల 10వ తేదీని సమావేశమయింది. క్రిందటి సమావేశంలో కష్టపడి పనిచేసేవారికి 1 శేరు బియ్యం రేషనింగుచాలదనీ, చేనేత పనివారికి గంజికోసం ఇచ్చేబియ్యం కోటా హెచ్చించాలని తీర్మానాలుచేశారు. బిచ్చగాండ్రకు మ్యునిసిపాలిటీ ఉచితభోజనశాలలు ఏర్పాటు చేయాలనికూడా తీర్మానించారు. వీటిని గురించి కలెక్టరుతో చర్చించడానికి మొన్నటి సమావేశంలో ఒక కమిటీని నియమించారు. దీనిలో వివిధ పక్షాల ప్రముఖులున్నారు.ఏలూరును ఆనుకొని, మునిసిపాలిటీ హద్దుల్లో లేని గ్రామాలు కొన్ని ఉన్నాయి. రేషనింగు అమలు జరిగినప్పటినుంచి ఈ గ్రామాల ప్రజలకు పట్టణంలో బియ్యం అమ్మటంలేదు. ఎంతో దూరం నడిచి ఇతర గ్రామాలకు వెళ్లి కొనుక్కోవలసి వస్తూంది. కాబట్టి ఈ గ్రామాలనుకూడా ఏలూరు మునిసిపాలిటీ రేషనింగ్ ఏరియాలో కలుపుకోవడమో లేక ఆగ్రామాల్లోకూడా డిపోలు పెట్టడమో చేయించాలని ప్రభుత్వాన్నికోరుతూ తీర్మానించారు. రేషనింగుకార్డు లివ్వటంలో అనవసర ఆలస్యం జరగకుండా చూడాలని ఒకతీర్మానం కోరిందిచి.

సాధారణంగా పది యకరాలున్న రైతులు 2 బస్తాల విత్తనాలు నారుకు వేసుకోవడం మామూలు. వసతిలేక నారు వేయనివారికి సప్లయి చేయడానికి. ఒకవేళ కొంత నారు చెడిపోయినా ఇబ్బంది లేకుండా ఉండడానికి ఇలా రెండుబస్తాలు వేస్తారు. ఇప్పుడు అధికారులు పదియకరాలున్నవారి 1 బస్తాకంటె ఎక్కువ విత్తనాలకి అనుమతి నివ్వడంలేదు. దీనివల్ల రైతులకు ఇబ్బంది. కాబట్టి ప్రభుత్వం రెండు బస్తాలకు అనుమతినివ్వాలని కోరుతూ ఒక తీర్మానం చేశారు.

నెల్లూరులో ఆహారకమిటీ కృషి

నెల్లూరు పట్టణ ఆహారకమిటీ ఏర్పడినప్పటినుండి చురుకుగాపనిచేస్తోంది. ఆహారకమిటీ ఆఫీసు ఒకటి నెలకొల్పారు. దాని శాఖ ఒకటి పత్తేఖానుపేటలోకూడ ఏర్పరిచారు. నెల్లూరులో రేషనింగ్ ప్రవేశపెట్టకముందు రేషన్‌కార్డులను అధికారులు పంచిపెట్టారు. కాని కొన్ని కుటుంబాలకు అవి అందలేదు. కిరోసిన్ రేషన్‌కార్డులుకూడా కొందరికి అందలేదు. వీటివిషయమై ఆహారకమిటీ పనిచేస్తోంది. దాదాపు 3 డివిజన్లలో లెఖ్ఖలు పూర్తిచేసింది. బియ్యం, బొగ్గు, కట్టెలు మొదలైనవి దొరక్కపోయినా, కంట్రోల్‌ధరలకు లభించకపోయినా, ప్రజలు ఆహారకమిటీకి రిపోర్టు చేస్తున్నారు. కట్టెల డిపోలో, బొగ్గులు, కట్టెలు సరిగా అమ్మించి ఒత్తిడి లేకుండా ప్రజలను వాలంటీర్లు సర్దుతున్నారు. ఇలా ప్రజాసేవ చేయుచున్న ఆహారకమిటీలో అన్నిపక్షాలు ఐక్యంగా పని చేయడం ప్రశంసనీయం.

ఇంతేగాక ఈ క్రిందికోర్కెలకై ఆహారకమిటీ ఆందోళన చేస్తూంది.

1. గోధుమలు, రవ, మైదా యిచ్చుటకి దిగుమతియైన వారం రోజుల్లోపుగానే, వాటి ధరలు నిర్ణయించాలి. లేనిచో అవి గోడౌన్సులో ఒకమాసంకాలం వుండి చెడిపోవడం, ప్రజలు యిబ్బంది పడడం జరుగుతున్నది.

2. బీదవారికి రేషన్ అంగళ్లలో, ఎర్రబియ్యం, సూకలుకూడా తక్కువ రేటుకు అమ్మాలి.

3. జిల్లాకు సరిపోను మిగిలిన ఉలవలే ఇతర జిల్లాలకు ఎగుమతి చెయ్యాలి. వాటిధరె కంట్రోలు చేయాలి.

4. కాయధాన్యాలు, చింతపండు, మిరపకాయలకు లోటు. చిల్లర ధరలు ప్రభుత్వం నిర్ణయించి అమ్మించాలి. వీటిని ఇతర జిల్లాలనుండి సక్రమంగా సరఫరా చెయ్యాలి. ఎక్కువ కోటా కో-ఆపరేటివ్‌స్టోర్సుకు ఇవ్వాలి.

5. రేషన్ అంగళ్ళకు ప్రదేశము నిర్ణయించనందున, కొన్ని అంగళ్ళ యజమానులు ఎక్కువ కోటావుండే కార్డులనే రిజిస్టరు చేసుకొని, తక్కిన వాటిని నిరాకరిస్తున్నారు. అందుచే ఇంటిప్రక్కన రేషన్ అంగడి ఉండికూడా, తమ కోటా తక్కువైనందున, కొందరు దూరంగా యింకో అంగడికి వెళ్ళవలసివస్తున్నది. కాబట్టి టౌనుకూడా 21 అంగళ్ళతోపాటు 21 సర్కిల్సుగా విభజించాలి. ఏ సర్కిల్‌లోనివారు ఆ సర్కిల్‌లోని అంగడిలోనే కొనుక్కోవాలి.

6. జిల్లాఆహారకౌన్సిలులో, యీకమిటీకి ప్రాతినిధ్యం యివ్వాలి.

7. టౌనుసరిహద్దులకు దగ్గరగా నివసిస్తూ, బియ్యానికి టౌనుమీద ఆధారపడే వారికి రేషన్‌కార్డులయినా ఇవ్వాలి; లేనిచో డిపోలు పెట్టించి బియ్యాన్ని కంట్రోలుధరకు అమ్మించాలి.

8. ఇనుము వర్తకులు కంట్రోలుధరలకు అమ్మకపోవడం గురించి తగినచర్య తీసుకోవాలి. ఇనుమునంతా కమాండీరుచేసి కో-ఆపరేటివ్‌స్టోర్సు, అగ్రికల్చరల్ డిపోల ద్వారా అమ్మించాలి.

9. కష్టపడి పనిచేసే కార్మికులకు రేషన్ హెచ్చించాలి.

చిత్తూరు జిల్లాలో కమాండీరింగు

చిత్తూరుజిల్లాలో, కమాండరింగు విషయంలో ప్రభుత్వం ఈదిగువపద్ధతి ననుసరిస్తుంది.

— 5 యకరాలకుపైన సాగుచేసినవారి దగ్గర్నుంచి మొత్తం ఉత్పత్తిలో సగం కొంటారు.

— పదియకరాలపైన రాగి, జొన్న, సజ్జ సాగుచేసినవారి దగ్గర్నుంచి ఎకరానికి 30 శేర్లు కొంటారు.

— కోతలు జరిగేముందు గ్రామాధికారుల అనుమతి తీసుకోవాలి.

— 60 శేర్ల (150 పౌనులు) బస్తా ఒకరకం రు 9 లు, రెండోరకం రు 8-8-0 ధర నిర్ణయించారు.

గ్రామంలోని జనసంఖ్యనీ, గ్రామావసరాలనీ, లెక్కలోకి తీసుకోవాలనేదృష్టి ఈ ప్లానులో కనబడదు. కుటుంబావసరాలను, గ్రామావసరాలను లెక్కచూడకుండా కమాండీరింగుకు పూనుకుంటే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత కలుగుతుంది.

● అంతేకాకుండా 150 పౌనుల బస్తా అధమపక్షం రు. 10 అయినా ఉంటేనేగాని రైతుకుకిట్టుబాటుకాదు. ఈ విషయాలను తెలియజేస్తూ జిల్లాకలెక్టరుకు, సబ్‌కలెక్టరుకు రైతుసంఘంవారు పిటిషన్లు పంపారు. దానిపై గ్రామంలోని జనసంఖ్య, వారి అవసరాలు, పుత్పత్తిలెక్కలు పంపవలసిందని కరణాలకు ఉత్తరువులు వచ్చాయి. పెద్దవారికి 5 సోలలు చిన్నవారికి 2½ సోలలు. సేద్యపు అన్నలు 134 శేర్లు, విత్తనాలకు 31 శేర్లు పోగా మినహాయించి మిగతాలెక్క తయారు చేయవలసిందని ఉత్తరువులు వచ్చాయి. ఈలెక్కలను బట్టి కమాండీరింగు సాగేలా తగుర్పాట్లు చేయాలి.

పిఠాపురం తాలూకా ఆహారమహాసభ

పిఠాపురం తాలూకా ఆహారపదార్థాల విషయంలో కొరతతాలూకా. గతసంవత్సరం కరువు వచ్చింది. ఈ సంవత్సరం ఇంకా ముందుగానే కరువు వచ్చేటట్లువుంది. గత సంవత్సరం ఆమలదాలు పెద్దలను కదల్చింది. ముందుగానే జాగ్రత్తపడడానికి వివిధ పక్షాలవారు పూనుకొని ఈ నెల 12 వ తేదీని కొండెవరం గ్రామంలో ఆహారసభ జరిపారు. 7 గ్రామాలనుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సభకు రావుసాహెబ్ గోటేటి జోగిరాజువంతులుగారు అధ్యక్షత వహించారు. సభలో తాలూకా ఆహారకమిటీని ఎన్నుకొన్నారు. కమిటీకి శ్రీవాడ్రేవు గోపాలకృష్ణగారిని అధ్యక్షులుగాను, కామ్రేడ్ బుల్లిరాజును కార్యదర్శిగాను ఎన్నుకున్నారు. డిసెంబరు నెలాఖరుకు కావలసిన ఆహారపదార్థాల లెక్కలు సేకరించుటకు తీర్మానింపబడమైనది.

ఇనుపసామగ్రికై రైతులపోరాటం

విశాఖపట్నం జిల్లాలో చీపురపల్లి గ్రామ కో-ఆపరేటివ్‌స్టోరుకు కొన్ని జతలు బండిపట్టాలు వచ్చాయి. వాటిని రైతులకందజేయవలసిందిగా ఉత్తరువులు వచ్చాయి. కాని సొసైటీలో పెత్తనం షాహుకార్లది. వారు బండిపట్టాలను కంట్రోల్‌రేటు కంటె అధికంగా దొంగమార్కెట్లో అమ్మాలని నిశ్చయించుకున్నారు. జత 1కి రు. 21-12-0 లకు అమ్మవలసియుండగా, అంతకు మూడు రెట్లు పెంచి అమ్మసాగారు.

తాలూకా రైతుసంఘం ఈ అన్యాయాన్ని గురించి కో-ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రారుకు తెలియజేసింది. 9-6-44 వ తేదీని ఒక విచారణాధికారివచ్చి, విచారణచేశాడు. రసీదులు లేవిదే తానేమీ చేయజాలనని ఆయన నిష్క్రమించాడు. చట్టవిరుద్ధంగా ఎక్కువరేట్లకు అమ్మేవర్తకుడు రసీదు లిస్తాడా? ఇట్టి అక్రమాలను కో-ఆపరేటివ్ అధికార్లు అరికట్టకపోతే, కంట్రోల్‌స్కీము హాస్యాస్పదం కాక మానదు.

గూడూరులో దొంగవ్యాపారం

గూడూరులో బండిపట్టాలు తెప్పించి పంపకంచేసేది గూడూరు కో-ఆపరేటివ్ యూనియన్. ఈ మధ్య ఆయూనియన్‌కి కొంత స్టాకు వచ్చినప్పుడు, తాలూకా రైతుసంఘ వర్కర్లు యూనియన్ కార్యదర్శివద్దకు వెళ్లి అడిగితే, యింకా సరుకురాలేదని ఆయన జవాబిచ్చాడు. మరునాడు సాయంకాలం తిరిగిఅడిగితే, వచ్చిందిగాని అమ్మకం అయిపోయిందన్నాడు. యదార్థం విచారించగా రు. 19-8-0 లు విలువగలపట్టాలు రు.18లకు అమ్మినట్లు తెలిసింది. ఈ విషయమైతాలూకా రైతుసంఘ కార్యదర్శివెళ్లి అడిగితే, ఖర్చులకు కొంత తీసుకున్నట్లు జవాబుచెప్పాడు.

ఈ నెల 4 వ తేదీని యూనియన్‌కి తిరిగి బండిపట్టాలు వచ్చాయి. కాని కార్యదర్శి మళ్ళీ పాతపాటే పాడినాడు.

ఈ సహకార సంఘ కార్యనిర్వాహక సభ్యులు, మెంబర్లు యూనియన్ కార్యదర్శిని మందలించి, యికముందైనా యీవిధంగా జరుగకుండా చూడాలని తాలూకా రైతుసంఘ కార్యదర్శి హెచ్చరిస్తున్నారు.

దొంగవ్యాపారస్తుని ఆట కట్టింది

అత్మకూరు తాలూకాలో పరిటాల వెంకటసుబ్బయ్య అనే లైసెన్సుదారు యినుము అమ్మకంలో ఎలా దగాచేస్తున్నాడో పాతకులకు తెలిసేవుంది. గతమాసం 26, 27 తేదీలలో ఈ లైసెన్సుదారు రహస్యంగా ఇనుము పరికరాలను యితర గ్రామాలకు దాటవేస్తూవుంటే, వాలంటీర్లు పట్టుకొని స్థానికాధికారులకు రిపోర్టు చేసినప్పటికీ, వారెట్టి చర్యతీసుకోలేదు. 21వ తేదీని 300 మంది రైతులు వ్యవసాయశాఖవారిచ్చిన సర్టిఫికేట్లతో వచ్చి సరుకు యివ్వమని పై లైసెన్సుదారుని కోరినారు. పాత స్టాకు అయిపోయిందనీ, కొత్త స్టాకుకు ధరలు నిర్ణయంకాలేదనీచెప్పి, అమ్మకానికి సరుకు లేదన్నాడు. రైతుసంఘంద్వారా వచ్చినవారికి యినుము దక్కనీయనని బెదిరించాడు.

వెంటనే రైతుసంఘవాలంటీర్లు యీ రైతులందరినీ ఆర్. డి. ఓ. వద్దకు తీసుకెళ్ళి, జరిగినదంతా తెలియజేశారు. లైసెన్సుదారు కూడా హాజరై, రైతువర్కర్లు యుద్ధవ్యతిరేక ప్రచారంచేస్తున్నట్లు బుకాయించి, ఆర్. డి. ఓ. ను తనపక్షం తిప్పుకోవాలని ప్రయత్నించాడు. కాని, రైతువర్కర్లు నిజపరిస్థితిని తెలియపరచగా, తహసీల్దారు సహాయంతో రైతులకు యినుం యిప్పించండని రైతువర్కర్లతో చెప్పాడు.

ఆరోజే తహసీల్దారువచ్చి, లైసెన్సుదారు కొట్టును తనిఖీచేసి, నిల్వవున్న యినుమును గ్రామాలవారీగా కోటాలు నిర్ణయించినవారికి అమ్మవలసిందనీ, కొత్తస్టాకుకు ధరలు నిర్ణయించిన తదుపరి తన అనుమతితో రైతుల కమ్మవలసిందనీ, ఉత్తరువుచేశాడు. ఆప్రకారం, మరుచటిదినం రైతులువచ్చి సరుకు అడగ్గా, తహసీల్దారు గ్రామంలోలేరనిచెప్పి కొట్టును మూసివేశాడు.

ఈ విషయం రైతువర్కర్లద్వారా తహసీల్దారు తెలుసుకొని, యీ క్రిందివిధంగా ఉత్తరువు చేశారు: "గ్రామాధికారి సర్టిఫికేటు తీసుకొని, తహసీల్దారు అనుమతిని పొందిన వారికే యినుము అమ్మాలి. దానికి వ్యతిరేకంగా అమ్మితే, చర్యతీసుకొనబడుతుంది."

తదుపరి 7 గ్రామాల రైతులు కంట్రోలు ధరలకు యినుము కొనుక్కోగలిగారు. షాహుకారి ఆటకట్టింది. ఈవిషయంలో ఎగ్రికల్చరల్ డిపార్టుమెంటువారు రైతువర్కర్లకు సహాయంచేశారు.

గ్రామైక్యతకు అపూర్వవిజయం

నూజివీడు తాలూకాలో పోలసానిపల్లి అనే మొఖాసాగ్రామం వుంది. మొఖాసాదార్లు రైతుల - కూలీల అనాదిసిద్ధమైన హక్కులకు భంగం కలిగిస్తున్నారని; అనగాని శ్రీరంగం అనే రైతును మొఖాసాదార్లు అన్యాయంగా చెప్పుతో కొట్టినాడని, రైతులు - కూలీలు కలసి మొఖాసాదార్ల పనులకు వెళ్ళకుండా సమ్మెచేశారు. ఈ సమ్మె గ్రామైక్యతకు, ఆహారోత్పత్తికి, ఎంత హానికరమో స్థానిక కమ్యూనిస్టుపార్టీ అర్గనైజరు, రైతుసంఘ కార్యదర్శి, తెలుసుకొని, 24—5—44 వ తేదీని రైతుల్ని - కూలీలను సమావేశపరిచారు. సమ్మెకుగల కారణాలను న్యాయంగాతెలుసుకున్నారు. తర్వాత మొఖాసాదార్లవద్దకు రాయబారం వెళ్ళి, గ్రామైక్యత యొక్క అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ కృషి ఫలితంగా, రైతులు - కూలీలు కోరిన ఈక్రింది హక్కులకు మొఖాసాదార్లు అంగీకరించారు.

1. అడవికంప, గట్టుగాయి, స్వేచ్ఛగా ప్రతి ఒక్కరూ తెచ్చుకోవచ్చు.

2. మొఖాసాదార్లదొడ్డి ఆవరణకు వేసిన కంప బజార్లోకి వచ్చినందున, దాన్ని తిరిగి తమ సరిహద్దులో వేసుకోవడం.

3. మాదిగగూడెంకు వెళ్ల డొంక యిరుప్రక్కల దారికి అడ్డంగాపెరిగి యున్నందున దాన్ని తరికించడం.

4. మోట్రు అనంతం పెళ్లికి రు. 125 అప్పుతెచ్చుకొని, అందులో రు. 60 యిచ్చి అప్పుతీర్చినప్పటికీ, నోటుమీద వసూలు పెట్టలేదు. యిప్పుడు వసూలు పెట్టడానికి అంగీకరించారు.

5. కుంచపు సూరాయ రు 50 నోటు బాకీలో రు 3 తప్ప మిగతాదాన్ని తీర్చినప్పటికీ, మొత్తం నోటుకు (రు 50) ప్లెయింటు చేసెను. దాన్నియిప్పుడు న్యాయంగా పరిష్కరించడానికి మొఖాసాదారు అంగీకరించాడు.

అనగాని శ్రీరంగం అనేరైతును చెప్పుతో కొట్టడం తానే తొందరపడి చేసినపని అని మొఖాసాదారు అంగీకరించి, రైతుల్ని-కూలీలను యికముందు గౌరవభావంతో చూచుటకు సమ్మతించాడు.

25-5-44 తేదీని తాలూకా రైతుసంఘ కార్యదర్శి చలసాని రాజగోపాలరావు అధ్యక్షతక్రింద బహిరంగసభ జరిగింది. కొత్తగా సాధించబడిన యీ గ్రామైక్యతను ప్రశంసిస్తూ ఉపన్యాసాలీయబడ్డాయి.

రైతులకు ఎరువుల పంపకం

గతనెల ఒంగోలుతాలూకాలో ఈతముక్కల, మడనూరు, తేటిపురం, రాజుపాలెం, గమళ్లపాలెం, కొత్తపట్నం, పాదర్తి, గుండమోల, మూటమోల, పల్లెరెడ్డిపాలెం రైతులకు అమోనియామెరువును పంచారు. గత జనవరి మాసంలో ఎరువును పొందని 800 మంది రైతులకు ఒక్కొక్కరికి రు 3-0-0చొప్పున 7 టన్నుల అమోనియా, 14 టన్నుల మిక్చరూ, పంచిపెట్టబడింది. మిగతా 2400 మంది రైతులకు ఒక్కొక్కరికి రు 1-8-0 చొప్పున పంచిపెట్టబడింది. షుమారు 100 మంది రైతులకుమాత్రం అమోనియా దొరకలేదు. అమ్మవద్రోలు పంపకంలో మిగిలితే యిస్తానని ఐ. సి. ఐ. కంపెనీ సూపర్‌వైజరు వాగ్దానం చేశారు. కొత్తపట్నంలో కేంద్రంయేర్పాటుచేసి చుట్టూ గ్రామాలకు పంపకంచేయడంవల్ల, రైతులకు సునాయాసంగా యెరువు లభించింది. ఐ. సి. ఐ. కంపెనీ సూపర్‌వైజరు కృషి ఫలితంగానే యెరువుల పంపకం సక్రమంగా జరిగింది. ముందు కొత్తపట్నంలో స్టోర్సు పెట్టించి యిదేప్రకారంగా పంపకం చేయాలి.

అనంతపురంజిల్లా రైతుసంఘ సమావేశము

పై సమావేశం 8-6-44 వ తేదీని శ్రీపత్తిపాటి రంగప్పనాయుడుగారి అధ్యక్షతను జరిగింది. వివిధప్రాంతాలనుండి 63 గురు ప్రతినిధులు హాజరయారు. ఈ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి.

1. అధికాహారోత్పత్తికి రైతుల్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం విరివిగా బంజరు భూమిని సాగుకుయివ్వాలి. మంచిరకపు విత్తనాలు సమృద్ధిగా సప్లయిచేయాలి. ఇనుము పనిముట్లను కంట్రోల్‌రేట్లకు అమ్మించాలి. ఎరువులు చౌకగా లభించేటట్లు ప్రభుత్వం ఏర్పాటుచేయాలి. చెడిపోయిన కాల్వలకు, చెరువులకు మరమ్మతు చేయించాలి.

2. రైతులు వ్యాపారపు పంటలు తగ్గించి, ఆహారపంటలపై దృష్టిని కేంద్రీకరించాలి. గొర్రెలమందలను ఎక్కువచేయాలి. కోళ్లను బాగా పెంచాలి. రైతు-కూలీ సామరస్యం ద్వారా గ్రామైక్యతను నిర్మించాలి.

3. జిల్లాయందలి కరువు పరిస్థితిని తొలగించడానికి ప్రభుత్వం వెంటనే పెన్నా-కుముద్వతి, అప్పర్ పెన్నారు, ఈ తోడు, భైరవానితిప్ప ప్రాజెక్టుల నిర్మించాలి. జిల్లాలో రిపేరు చేయించవలసిన చెరువులను రిపేరు చేయించాలి.

4. గాంధీజీ త్వరలో ఆరోగ్యాన్ని కోలుకొని, జాతీయైక్యతను నిర్మించి, దేశరక్షణకు ప్రజాపామాన్యాన్ని నడిపించవలసిందని కోరుతూ తీర్మానింపబడింది. ముస్లింలీగ్‌కూడా యిందుకు తోడ్పడవలసిందని హెచ్చరింపబడింది.

బంజరుభూముల సేద్యం

పశ్చిమగోదావరిజిల్లా లింగసిబోయినచర్ల గ్రామంలో సేద్యమున కనుకూలమైన బంజరు 1000 యకరాలవరకూ వుంది. అందులో 250 యకరాలుమాత్రమే 1942 లో మనిషికి 1 యకరం చొప్పున ఏక్‌సాల్ పట్టాలపై గ్రాంటుచేశారు. వాటిని రైతులు చాలవరకు మరమ్మతుచేసి, వరి పండించారు. కాని, 1943 లో యీ రైతులందరిని తొలగించి, తిరిగి కొత్తవారికి ఏక్‌సాలు పట్టాలపై భూము లిచ్చారు.

ఇలా ప్రతిసంవత్సరం కొత్తవారికి యిచ్చివేస్తూంటే, రైతులు నమ్మకంతో మరమ్మతు చేయడానికి జంకుతారు.

పరిస్థితులిలావుండగా, 21-5-44 వతేదీని తహసీల్దారు యీ గ్రామానికొచ్చి; మళ్లీ యింకోలిస్టు తయారుచేశారు. దీనివల్ల మనిషి 1కి 3 యకరాల చొప్పున వస్తుంది. అయితే, చాలా తక్కువమందికి భూమిలభిస్తుంది. చాలా మంది పేదరైతులు-కూలీలు మిగిలిపోతారు. 30-5-44 వ తేదీని రైతులు జిల్లా కలెక్టరువద్దకు వెళ్లగా, పూర్వం మాదిరిగానే మనిషి 1కి యకరం చొప్పున సర్దియిస్తామని వాగ్దానం చేశారు. వ్యవసాయ తరుణం సమీపించింది. వెంటనే కలెక్టరు తన వాగ్దానాన్ని చెల్లించుకోవలసిందని హెచ్చరిస్తూ, గ్రామరైతుసంఘ కార్యదర్శి ప్రకటన గావిస్తున్నారు. దీనితోపాటు మిగతా బంజరు భూమినికూడా సాగులోకి తీసుకురావలసియుంది.

3 సంవత్సరాల సోవియట్ - జర్మనీ యుద్ధం

(12వ పేజీ తరువాయి) ఖాయమయింది. జనవరి 18 వ తేదీన లెనిన్‌గ్రాడ్ రంగంనుండి గొవరావ్, వాల్కావ్‌రంగంనుండి మెరిట్స్కొవ్ సైన్యాలురెండూ కలిసాయి. వీరిద్దరి సైన్యాలను సమన్వయపరచి నడిపిన యుద్ధ తంత్రనిపుణుడు జుకావ్. 1943 వేసవి నుండి, అవసరమైనవారు మాత్రమే లెనిన్‌గ్రాడ్‌లోవుండి, దానినొకకోటగా లెనిన్‌గ్రాడ్ పౌరులు మార్చివేశారు. పైనుండి బాంబులు, పశ్చిమంనుండి ఫిరంగులు లెనిన్‌గ్రాడ్‌ను నాశనంచేస్తున్నా, దిగ్బంధఫలితంగా 32 వేల మంది మరణించినా లెక్కచేయక, లెనిన్‌గ్రాడ్‌వీరులు చరిత్రలో ఎన్నడూ ఎరుగని దిగ్బంధానికి ఓర్చుకున్నారు. లెనిన్‌గ్రాడ్‌కోట గుమ్మంముందు ఈ దాడిలో 5 జర్మను డివిజన్లను నాశనంచేసి, 13 వేలమందిని బలిగొన్నారు సోవియటు సైనికులు.

ఇంతేగాదు. జనవరి 15 వ తేదీన వారొనెజ్‌నుండి గూడా మరొకదాడి ప్రారంభమయింది. ఈ విధంగా 3నెలల్లో 2 వేల కిలోమీటర్ల వెడల్పున (కిలోమీటరు సుమారు 5 ఫర్లాంగులు) 5 దిక్కులనుండి విజృంభించాయి సోవియటు సైన్యాలు.

కుర్స్క్ యుద్ధం

స్టాలిన్‌గ్రాడ్ యుద్ధానంతరం సోవియటు విజయరథచక్రంక్రింద లక్షలకొలది నాజీసైనికులు బలిఅవుతూవచ్చారు. గుండెనిబ్బరం చెడిపోతున్న జర్మనుసైన్యాలకు ఉత్సాహం కలిగించాలనుకొన్నాడు హిట్లరు. స్టాలిన్‌గ్రాడ్‌కు ప్రతిక్రియ చేయాలని ఎంచాడు. అందుకని 1943 వేసవిలో కుర్స్క్‌వద్ద భయంకరమైన ఎదురుదాడులు సాగించాడు. స్టాలిన్‌గ్రాడ్‌లో జూదమాడినట్లుగానే, కుర్స్క్‌వద్ద సోవియటు సైన్యాలను వలయంలో బంధించాలని తన సర్వశక్తులను కేంద్రీకరించి ఒక జూదం ఆడాడు హిట్లరు. పోలండుయుద్ధంలో ఉపయోగించినటాంకులకంటె ఎక్కువగాను, 1941 లో మాస్కో యుద్ధంకంటె ఎక్కువగానూ, టాంకులను ఉపయోగించాడు. జులై 5 వ తేదీన బైలోగ్రాడ్, ఓరెల్ దిక్కుల నుండి జర్మనీదాడి సాగింది. కొద్దిరంగంలో జర్మనుబలాన్నంతా కేంద్రీకరించాడు హిట్లరు. 1941 లో 1900 మైళ్ళ రంగంలో యుద్ధం చేశాడు. 1942 లో 400 మైళ్ళ రంగంలో కేంద్రీకరించాడు. కాని ఈయుద్ధంలో 40 మైళ్ల మాత్రమే యుద్ధరంగం. అందులోను జర్మను టాంకులన్నిటినీ కేంద్రీకరించినది 7 లేక 8 మైళ్ళలోనే. ప్రతి అరమైలుకు 400 టాంకులు చొప్పున కేంద్రీకరించాడు. మొత్తం 7 టాంకు డివిజన్లను, 2 మోటారు డివిజన్లను, 11 పదాతిదళాలను, హిట్లరు ఉరికించాడు. కాని ఈ యుద్ధంలో కూడా జర్మనీ జయించలేదు. జులై 15, 23 తేదీలమధ్య 2900 టాంకులను, 1992 విమానాలను జర్మనీ పోగొట్టుకొంది.

కుర్స్క్‌యుద్ధంలో జర్మనీని ఓడించడమేగాక, జులై 12 న సోవియటు సైన్యాలు ఎదురుదాడి ప్రారంభించాయి. సోవియటు సైన్యాలు ఒక్క శీతకాలంలోనే దాడిచేయగలవు, వేసవిలో దాడిచేయలేవు-అనే అపఖ్యాతిని ఇపుడు బయటపెట్టాయి. సోవియటు సైనికశక్తి ప్రపంచానికి ఒక్కసారి మళ్ళీ రుజువయింది.

1943లో

1943వ సంవత్సరమంతటా అనేక ముఖ్య నగరాలు సోవియటువశమయ్యాయి. రెడ్‌ఆర్మీ ముందుకు సాగుతూనేవుంది. నవంబరు విప్లవదినోత్సవం రేవనగా కీవ్‌వశమయింది. 1944 జనవరిలో సోవియటుసైన్యాలు స్టరయారుస్సా, నావోసొకొల్నికి, విటెబెస్కు, జ్లోబిన్, ఓవ్రుచ్, కొరొస్టెన్‌ల సమీపంలో వున్నాయి. కీవ్‌కు పశ్చిమంగా 60 మైళ్ల పురోగమించాయి. డోనెట్జు మైదానంలో కిరోవొగ్రాడ్, క్రివయ్‌రాగ్, నికపోల్ ఖెర్సనులను సమీపించాయి. కెర్చిద్వీపకల్పంలో తూర్పుకొనను సోవియటు సైన్యాలు కాలుపెట్టాయి.

స్టాలిన్‌గ్రాడ్, కుర్స్క్‌యుద్ధాల తర్వాత చెప్పుకోదగిన యుద్ధాలు మియూసదివద్ద, మెలిటొపోల్‌వద్దజరిగాయి. డొనెట్జు, డెస్నా, సోజ్, డినీపర్ నదులను దాటుటలో సోవియట్ సైన్యాలు మిలిటరీ చరిత్రలో ఎరుగని నైపుణ్యాన్ని, ధైర్యాన్ని, శౌర్యాన్ని ప్రదర్శించాయి. జర్మన్లు డినీపర్‌నదిని తమ తూర్పు-రక్షణశ్రేణియను కొన్నారు. కాని అమిత వేగంతో ఆనదిని రెడ్‌ఆర్మీ దాటివేసింది.

1943 యుద్ధాల ఫలితంగా సోవియట్ సైనికుల, సైనికనాయకుల యుద్ధకౌశల్యం హెచ్చింది. మంచి అనుభవం గడించారు. సోవియట్ సైన్యం, యుద్ధంలో బాగానలిగి ఆరితేరిన మొదటి రకంగా మారింది, కాని జర్మను సైన్యాలో, జర్మను సైన్యాలలో మొదటిరకం అంతా నాశనం అయింది. ఈ సంవత్సరంలో 40 లక్షల జర్మన్లు నష్టపడ్డారు. ఇందులో 18 లక్షలు చావనేచచ్చారు. నాజీసైనికుల యుద్ధనైపుణ్యం, గుండెనిబ్బరం దిగజారింది. హిట్లరు జర్మనీలో "సంపూర్ణ సమీకరణము" ప్రారంభించ మొదలెట్టాడు.

1943 నవంబరు 15న జిటోమిర్ ప్రాంతంలో జర్మన్లు ఎదురుదాడి ప్రారంభించి కొద్దిగా విజయంపొందారు. కాని అది తాత్కాలికమే. తిరిగి డిశంబరు 24 వ తేదీనుండి సోవియట్ సైన్యాలు తిరుగ దండయాత్రప్రారంభించాయి. పోయిన భూమిని త్వరలోనే జయించాయి. ఒక్క ఆత్మరక్షణయుద్ధాలలోనేగాక, దాడి చేయుటలో గూడా సోవియట్ సైన్యాలదే పైచేయిఅని 1943 యుద్ధాలు తెలియజేశాయి.

1944 లో

ఈసంవత్సరంలోకూడ గత ఆరునెలలలో రెడ్‌ఆర్మీ అద్భుతవిజయాలను సాధించింది. లెనిన్‌గ్రాడ్‌కు మాస్కోతో రైల్వే సంబంధం ఏర్పడింది. లెనిన్‌గ్రాడ్‌చుట్టూ ఫిరంగిగుండ్ల వర్షం కురిపించి, లెనిన్‌గ్రాడ్ పౌరులను నానాబాధ పెడుతున్న నాజీ రాక్షసులను లెనిన్‌గ్రాడ్ చుట్టుప్రక్కల లేకండా రెడ్ ఆర్మీ తరిమివేసింది. బాల్టిక్ దేశాల ప్రాంగణంలో రెడ్‌ఆర్మీ నిలబడింది. మధ్యరంగంలో జనరల్ రొకోసొవస్కీ నాయకత్వాన తెల్ల రష్యాలో విజృంభించి అద్భుతవిజయాలను సాధించింది. డినీపరుమలుపులో కొనెవ్‌వద్ద మరొక స్టాలిన్‌గ్రాడ్ వలయం జర్మన్లచుట్టూ బిగించబడింది. 55 వేలమంది జర్మన్లు ఆ ఉక్కువలయంలో చనిపోయారు. 18 వేల మంది ఖైదీలయ్యారు. క్రిమియా ద్వీపకల్పమంతా శత్రుశేషంలేకండా తుడిచిపెట్టబడింది. ఒడెస్సా, సెబాస్టపోల్‌లు వశమయ్యాయి. యుక్రెయిన్‌రంగంలో జుకావ్, కీ. శే. వటూటిన్, కొనెవ్‌ల నాయకత్వాన రెడ్‌ఆర్మీ డినీపర్, బుగ్, డినీస్టర్, ప్రుత్‌నదులను దాటుటలో అసమాన కౌశల్యం చూపించింది. ఈ నదులు తమకు రక్షణశ్రేణులుగా ఉపయోగింపబడవని తలచిన నాజీలకు అవి సమాధులయ్యాయి. మార్చి 26 వ తేదీన సోవియటు సైన్యాలు తమ సరిహద్దులో 53 మైళ్లప్రదేశాన్ని విముక్తిచేశాయి. అనాడు నిజంగా చరిత్రాత్మకదినం. ఇంతేగాదు. జకోస్లావేకియాలో, రుమేనియాలో, రెడ్‌ఆర్మీ కాలుబెట్టింది. ఏప్రిల్ నెలాఖరువరకు సోవియటు విజయయాత్ర నిరాఘాటంగా సాగుతూనేవుంది. తర్వాత నిస్తబ్ధత ఏర్పడింది. కాని, మరొక మహావిజయయాత్ర సాగించడానికిచేస్తున్న సన్నాహం మూలంగానే, ఈ స్తబ్ధత ఏర్పడింది.

ఈ అఖండవిజయాలన్నిటినీ, రెండవ రంగం లేకుండానే సోవియట్ సాధించింది. "జర్మను యుద్ధయంత్రదాటికి ఆగగల్గడమేగాక, ఒంటరిగా జర్మనీకి అనేక అపజయాలను సోవియట్ కల్గించిందంటే, రెండవరంగమేవుంటే హిట్లరు పరిస్థితి మరెంత అధ్వాన్నమౌతుందో ఊహించండి" అనిఅన్నాడు స్టాలిన్. ఆ రెండవ రంగం ఇప్పుడు వచ్చింది. బాల్టిక్, బాల్కన్ దేశాలను, పోలండును-ఇంతెందుకు-యూరప్ యావత్తునూ – విముక్తిగావించ సోవియటు సైన్యాలు సిద్ధంగా ఉన్నాయి. అప్పుడే ఫిన్లండు విముక్తి ప్రారంభమయింది. మాస్కో - టెహ్రాన్ సమావేశాల ఫలితంగా ప్రపంచ ప్రజాస్వామ్య శక్తులమధ్య అభేద్యమైన ఐక్యతఏర్పడింది. ఇటలీలో ఫాసిస్టుల కుద్వాసనజరిగి, ప్రజారాజ్యమేర్పడింది. ఈనాడు ఫ్రాన్సులో తిరిగి స్వేచ్ఛాపతాకం ఎగురనున్నది. 1944 లోనే హిట్లరు నాజీమూకల నాశనంతో యూరప్‌యుద్ధం సమాప్తి అయి, స్వేచ్ఛా,శాంతి,అభ్యుదయాలు మానవకోటికి లభ్యమవుతాయని ఆశించవచ్చు.

చెరుకు రైతులకు అన్యాయం

— నండూరి ప్రసాదరావు

ఇండియా ప్రభుత్వపు బెల్లంకంట్రోలు ఆర్డరు ననుసరించి ది 17-10-43 న ఆంధ్రదేశంలోని 242 గ్రామాలలో, పర్మిట్లు లేకుండా చెరుకును ఆడకూడదని మద్రాసు ప్రభుత్వం నిషేధించింది. పంచదార మిల్లు యజమానులు కోరినందుననే ప్రభుత్వం ఈఆర్డరును జారీచేసింది. కాని ఈఆర్డరును జారీచేయుటంలో ప్రభుత్వం గుడ్డిగా ప్రవర్తించింది. మిల్లుకు నిజంగా ఎంతకావాలో అంతచెరుకును రిజర్వుచేయుటలో కొంత అర్థముంది. కాని మిల్లుఏరియా అని నిరంకుశంగా నిర్ణయించి, ఆగ్రామాలన్నిటిలోని చెరుకునూ బెల్లం ఆడకూడదని నిషేధించుటలో అర్థంలేదు. ఈ విషయాన్నే బెజవాడలో అప్పుడుజరు శ్రీ గోటి రామమూర్తిగార్కి తెలియబర్చాను. ఉదాహరణకు తుంపాల ఫ్యాక్టరీఏరియాను చూపాను. తుంపాల ఫ్యాక్టరీ నిరుడుఆడింది 2400 టన్నులు మాత్రం. పూర్తిగావనిజేస్తే 20900 టన్నులు మాత్రం ఆడగల చిన్నఫ్యాక్టరీ. ఐనా ప్రభుత్వం ఈఫ్యాక్టరీసప్లయికని తుంపాల, మునగపాక, నాగులాపల్లి, తగరంపాడు మొదలైన 16 గ్రామాలలోని 49800 టన్నుల చెరుకును బెల్లం ఆడకూడదని నిషేధించారు. ఫ్యాక్టరీకి కావలసిన చెరుకును మాత్రం తీసుకొని, మిగతాదానిపై నిషేధాన్ని తొలగించమనికోరాను. కాని ఆవిధంగా జరుగలేదు. ఫలితం రైతులు నష్టపడటం.

దీనిపై అనకాపల్లి తాలూకా రైతుసంఘం ఆందోళనచేసింది. చివరకు 28—12—43 న రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు రైతుసంఘ ప్రతినిధులనూ, మిల్లుప్రతినిధినీ సమావేశపర్చారు. మిల్లుప్రతినిధి తమ స్వంత చెరుకు 3000 టన్నులుఉందనీ, మరొక 6000 టన్నులకు లోగడనే రైతులతో కంట్రాక్టు చేసుకున్నాననీ, మరొక 11000 టన్నులుమాత్రం కావాలనీ చెప్పాడు. ధరవిషయంలో కూడ సంభాషనలు జరిగి దగ్గరతోటల చెరుకుకు టన్ను 1 కి రు 18/- లూ, దూరపు తోటల చెరుకు, రు 19/– లూ ఇస్తానన్నాడు. ఈ విధంగా కంట్రాక్టు వ్రాసుకోవటం జరిగింది. 17000 టన్నులుగాక మిగతా చెరుకు బెల్లం ఆడుకోవచ్చు నన్నారు. కాని, ఈవిధమైన ఆర్డరు జిల్లాకలెక్టరునుండి వచ్చునరికి చాల ఆలస్యమై కార్మిచెరుకు చాలా నష్టపడ్డది.

జనవరి 1వ తేదీనుండి మిల్లు ఆడటం ప్రారంభించింది. కాని త్వరలోనే మూలబడ్డది. అప్పటికి స్వంతచెరుకు 1000 టన్నులు,లోగడ కంట్రాక్టుచెరుకు 5000 టన్నులు, అగ్రిమెంటు చెరుకు 6000 టన్నులు మాత్రం ఆడారు. రైతువద్ద ఇంకా 6000 టన్నుల చెరుకు తీసుకోవలసివుంది. కాని మిల్లు చెడిందనే నెపంతో తీసుకోలేదు. వెంటనే జిల్లాకలెక్టరుకు ఈ విషయం తెలియజేయబడింది. కాని 8-6-44 వరకూ ఈచెరుకును బెల్లం ఆడుకోకూడదన్న నిషేధపు ఉత్తరువు నుండి తొలగించలేదు. మామూలుగా కార్మిని నవంబరునుండీ పుష్యపు, డిసెంబరునుండీ బెల్లం ఆడటం ప్రారంభిస్తారు. 6 నెలలై, చెరుకంతా చెడిపోయినపిమ్మట బెల్లంచేసుకోవచ్చునని ఆర్డరు! ఈలోగా బెల్లంధర పూర్తిగాపడిపోయింది. దక్షిణ దేశానికంతకూ అనకాపల్లి పెద్దమార్కెటు. ఇక్కడ మణుగు 1కి 3.8-0 నుండి రు 1-8-0 వరకూ ధర పడిపోయింది కారణం ఎగుమతికి వాగన్లు లేకపోవటం ఈ విధంగా రైతులు ఉభయభ్రష్టులైనారు. ఎండిపోయిన చెరుకును పొయ్యిలోనికి వాడుచున్నారు. ఈ విధంగా 100 టన్నుల చెరకును, అనగా 1800 రూపాయిలను నష్టపోయిన తగరంపాడు రైతును నేను ఎరుగుదును.

ఈ సమస్యకు సంబంధించిన రైతులనూ, మిల్లు యజమానులనూ, చిల్లరవర్తకులనూ జాయంటుగా సంప్రదింపులు జరుపకుండా నిరంకుశంగా ఆర్డర్లు జారీచేయటంవల్లవచ్చిన చిక్కులివి. కాబట్టి వెంటనే ప్రభుత్వం ఈ క్రింది కార్యాలను నెరవేర్చాలి.

1. తుంపాలఏరియాలో నష్టపడ్డ రైతులకు కంట్రాక్టు షరతుల ప్రకారం నష్టపరిహారం యిప్పించాలి.

2. బెల్లంధరలను కనీసం హోస్పేటధరలకైనా, అనగా 40 శేర్ల మణుగు 1కి రు. 8-4-0 కైనా పెంచాలి.

3. అనకాపల్లినుండి బెల్లం దిగుమతికై వాగన్లను సప్లయిచేయాలి.

4. చెరుకు ధరలనూ, మిల్లు ఏరియాలనూ నిర్ణయించుటలో రైతులనూ, మిల్లు యజమానులనూ; బెల్లం ధరలను నిర్ణయించటంలో రైతులనూ, బెల్లం వర్తకులనూ, కలిపి జాయంటుకమిటీల నేర్పర్చి, ఆకమిటీ నిర్ణయాలను అంగీకరించాలి.

5. మిల్లులకు కావలసిన యంత్ర పరికరాలనూ, బెల్లం వండుటకు కావలసిన పెనములు, ఇరుసులు వగైరా సామగ్రిని సకాలంలో అందించునట్లు చూడాలి.

[11-6-44 వ తేదీని అనకాపల్లిలోజరిగిన 1000 మంది బహిరంగసభలో పైకోర్కెలను బలపరుస్తూ తీర్మానాలు ఆమోదింపబడ్డాయి. ప్రభుత్వంతోను, ఫ్యాక్టరీ యజమానులతోను సంప్రతించుటకు శ్రీ దిగుమర్తి రామస్వామి కాంగ్రెసు ఎం. ఎల్. ఏ. గారు, మొదలైన 5 గురితో ఒక కమిటీని ఎన్నుకున్నారు.]

స్టర్లింగ్ సెక్యూరిటీలు

— వావిలాల గోపాలకృష్ణయ్య

మన దేశంలో చలామణి రూపాయిలలో జరుపుకుంటాం. మనదేశం విదేశాలతో చలామణీ వ్యవహారం జరుపుకునేటప్పుడు స్టర్లింగులద్వారా జరుగుతుంది. ఇందుకు కారణం ఇండియా ఇంగ్లండుకు వలసదేశం అవడం; అక్కడ చలామణి ఈనాడు స్టర్లింగు అనే కాకితం కావడం; ఈ స్టర్లింగు కాకితాన్ని పౌండు అని కూడా 1931 సెప్టెంబరు 21 వరకు పిలిచేవారు. ఈ రెంటికి అంతతేడా ఉండేదికాదు అనాడు ఇంగ్లండు గవర్నమెంటు బంగారు చలామణిని వదలి అచ్చంగా కాగితపు చలామణిని అంగీకరించడంవల్ల బంగారు చలామణితో నున్న పౌండుపోయి నోటు చలామణి అగు కాగితం మిగిలింది. దానిపేరే స్టర్లింగు.

జాతీయ ఋణం

మనదేశం తరపున చేయబడ్డ 'జాతీయ ఋణం' ఇండియాలోనూ, ఇంగ్లండులోను చేశారు. ఇండియాలో చేసిన ఋణం రూపాయిలలో చేశారుగనుక రూపాయి ఋణమనీ ఇంగ్లండులో చేసిన ఋణం పౌండులలో చేశారుగనుక పౌండు ఋణమనీ, ఆ పౌండు పోయి స్టర్లింగేనిర్ణీతం ఐనతర్వాత ఆపౌండు ఋణాన్ని స్టర్లింగుఋణమనీ అంటూవచ్చారు. ఆదేశపు లావాదేవీలు స్టర్లింగులోనే జరుగవలసి వచ్చినందున స్టర్లింగుదేశం అనికూడా అంటారు. బంగారానికి, చలామణికి గల సంబంధంతొలగించడంతో స్టర్లింగు విలువ పడిపోయింది గనుక, దానికి అంటగట్టిన మన రూపాయి విలువకూడా పడిపోయింది. అందువలననే అంతవరకు రు. 13-5-3 లకు లభించే నవరసుకు రు. 20, 30, 40 లు చెల్లించవలసి వచ్చింది. రూపాయిలు ఎక్కువ వస్తూండడం వలన, అప్పులు తీరక మునకలు వేస్తున్న భారత ప్రజానీకం లాభంగా తలచి బంగారాన్ని అమ్మివేశారు. మన దేశంలో ఆర్థికశాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం, 750 కోట్ల రూపాయీల విలువజేసే బంగారంలో దాదాపు 400 కోట్ల రూపాయీల విలువచేసే బంగారం మన దేశంనుండి బయటికి ప్రవహించింది. దేశం బీదగిలిపోయింది. విదేశాలతో జరిగే వ్యవహారమంతా స్టర్లింగుద్వారా జరుగుతున్నది ఇంగ్లాడు ఋణాలు స్టర్లింగు ఋణాలయినవి.

1939 నాటికి భారతదేశపు జాతీయఋణం 1170 కోట్ల రూపాయీల వరకు తేలింది. ఇందులో 727 కోట్ల రూపాయీలు ఇండియాలో చేసిన రూపాయి ఋణాలు. 442 కోట్ల రూపాయీలు ఇంగ్లండులో చేసిన స్టర్లింగు ఋణాలు.

యుద్ధం వచ్చాక

1939 సెప్టెంబరులో రెండవప్రపంచయుద్ధం ప్రారంభమయింది. బ్రిటను యుద్ధసామగ్రిని ఉత్పత్తిచేయడం అవసరం అయింది. ఇంగ్లండులో అన్ని ఉత్పత్తిస్థానాలు యుద్ధ పరిశ్రమ క్రిందికి మార్చారు. ఇంగ్లాండు ప్రభుత్వం ఇండియానుకూడా యుద్ధదేశంగా ప్రకటించి దీ[illegible] యుద్ధభారం పెరిగిపోయింది. దేశంలో యుద్ధానికై అప్పుచేయసాగింది. 1940 జూన్ 4 నుండి 1943 జూన్ వరకు 162 కోట్ల 93 లక్షల రూ॥లు 'డిఫెన్సులోన్సు' అంటూ అప్పుచేసింది. ఇంకా చేస్తూనే ఉన్నది. దేశంలో యుద్ధకారణాన ప్రజాజీవితం, ఆర్థికజీవనం,తారుమారయింది. వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయినవి. ప్రజావసరాలకు వస్తువులను తయారుచేసే ఉత్పత్తిస్థానాలు యుద్ధసప్లయిలలో నిమగ్నమైపోయినవి. ఇదివరకు వైస్రాయిగానున్న లార్డులిన్‌లిత్‌గో 1943 ఆగస్టు 3 వ శాసనసభలో చెప్పినట్లు యుద్ధం వచ్చిన తర్వాత ఇండియాలో

మొదటి 16 నెలల్లో	రు 85	కోట్లు
1941 సం॥ లో	113	,,
1942 సం॥ లో	224	,,
1943 సం॥ మే వరకు	142	,,
మొత్తం 1943 మే వరకు	563	,,

విలువగల యుద్ధసరఫరాలు తయారైనవి. వీటిల్లో ఆయుధాగారాల్లో తయారైన మందుగుండు సామానులు చేరలేదు. అవి:

1940 లో	రు 1343 లక్షలు
1941 లో	రు 3848 లక్షలు
1942 లో	రు 5262 లక్షలు

ఇంకా ఆర్డినెన్సు ఫ్యాక్టరీలలో రు 223 కోట్ల విలువచేసేవి తయారయినవి. ఇంకా అవుతున్నవి. ఈ విధంగా తయారుచేసే ఈ కోట్లకొలది వస్తుసామగ్రి యుద్ధానికి కావలసివస్తూంది.

ఈ వస్తుసముదాయ మంతటికి బ్రిటను చెల్లించవలసివుంది. దానికి బదులుగా బ్రిటిషు ప్రభుత్వం, అదివరకు ఇండియాప్రభుత్వం చేసిన స్టర్లింగు ఋణాలక్రింద జమకట్టుకోవడం ప్రారంభించింది. క్రమంగా ఇండియా ప్రభుత్వం ఇంగ్లాండులోచేసిన స్టర్లింగుఋణం చెల్లుబడి అయిపోయింది. అంతేగాక ఇంగ్లాండు ఇండియాకు ఋణపడ సాగింది. అనగా భారతదేశం సప్లయిచేసిన వస్తువులకు బ్రిటను డబ్బురూపేణా చెల్లించలేక స్టర్లింగ్ సెక్యూరిటీలు అంటగట్టసాగింది. అదేవిధంగా అమెరికా వగైరా ఇతరదేశాలు ఇండియాకివ్వాలసిన డబ్బును ఇంగ్లాండు వినియోగించుకొంటూంది. వీనికిబదులుగా స్టెర్లింగ్ సెక్యూరిటీలు అంటగడుతూంది.

ఇప్పుడు దేశంలో ఒక సమస్యవచ్చింది. ఇండియాలో ఉత్పత్తిఅయిన సామానుల ఖరీదు ఇంగ్లండులో అప్పులక్రింద జమకట్టితే ఇక్కడ పనిచేసిన ఉత్పత్తిదారులకు తిండి యేవిధంగా వస్తుంది? ఎవరిస్తారు? ఇది తేలాలి. అందుకై ఇండియా ప్రభుత్వం రిజర్వుబ్యాంకు ఈ స్టర్లింగులకు లెక్క ప్రకారం రూపాయి నోట్లు యివ్వడానికి అంగీకరించారు. అయితే వెంటనే నోట్లు అచ్చువేయడానికి వీలుపడకపోతే, Ways and means లెక్కలో నుండి ముందువాడి 1941 జూన్‌నెలకు తరువాత సరిచేశారు. రూపాయిని స్టర్లింగ్‌లోకి మారిస్తే, 1షి 6⅛ పెన్నీలు. అదే స్టర్లింగును రూపాయిలోకి మారిస్తే 1షి 5 $\frac{31}{32}$ పెన్నీలు దామాషాన అవుతుంది.

ఈ ఉత్పత్తి ఇంతటితో ఆగిపోతుందా? లేదుగా! అనుదినం వస్తువులు తయారవుతూ వున్నవి. ప్రతిరోజూ ఉత్పత్తిదారులకు వారి వ్యయం వారికి యివ్వవలసి ఉంది. ప్రతిరోజూ ఈ వస్తువులు స్టర్లింగులకు అమ్మకం జరుగుచున్నది. ఇంగ్లండుకేకాదు; మన సరుకు ఏ దేశానికి పోయినా ఇంగ్లండుద్వారానే స్టర్లింగుల ద్వారా వ్యాపారం జరగాలి. విదేశాలలోఅమ్మడం; అవచ్చినవిలువను స్టర్లింగులలోజమకట్టడం; జమకట్టినవిలువకు ఇక్కడ రూపాయినోట్లు ముద్రవేయడం; అనోట్లను ఉత్పత్తిదారుల కివ్వడం - ఈవిధంగా రోజుకు రు. 2½ లక్షల విలువగల నోట్లవరకు జారీ చేయసాగారు.

రూపాయినోట్లు బజారులో యిచ్చినంత మాత్రాన వస్తువులు లభించవు; లభించడానికి తగ్గ ఉత్పత్తి విధానం కూడా అభివృద్ధి చెందాలి. అందుకే సి. యస్. వకీలు అన్నట్లు, దామాషాప్రకారం ఉత్పత్తి నభివృద్ధిపరచకుండా నోట్లు అచ్చువేయడంవల్ల ధరలు అధికంగా పెరిగినవి. సామాన్యప్రజానీకానికి జీవితం దుర్లభం అయిపోయింది. ఇదే అదనని వ్యాపారులు ఆహారపదార్థాలలో కూడా అధికలాభాలు తీయసాగారు. అందువల్ల కష్టజీవి నరియగు తిండిలేక, వస్తున్నఆదాయం చాలక, ఆకలి మంటలకు, బలిఅయిపోతున్నారు. కలరా, మజ్జ బంకవిరేచనాలు, మలేరియా మొదలగు అంటువ్యాధులకు గురిఅవుతున్నారు.

దేశం ఈ విధంగా క్షీమానికి గురి అయింది. అయినా, లెక్కచేయకుండా స్టర్లింగు ఋణాలను 1943 జనవరి 11 వ తేదీకి ఇండియా పూర్తిగా చెల్లించివేసింది. అయితేఆరోజుతో సప్లయిలు ఆగిపోయినవా? వివిధ దేశాలకు సప్లయిల అవసరం తీరనులేదు. అందుచే సప్లయిలు సాఫీగా సాగిపోతూనే ఉన్నవి.

అప్పులు తీర్చింతర్వాత ఇక రొక్కబేరమే చేయవలసి ఉంటుంది. ఈ రొఖ్ఖం చెల్లించడానికి ఇంగ్లాండు ఆర్థికపరిస్థితులేవిధంగా ఉన్నవో చూడండి. తనసామ్రాజ్యలాభాలకోసం యుద్ధంలో దిగి, కొనసాగిస్తున్నది. దానికితోడు అభివృద్ధికర శక్తులగు చైనా, రష్యాతో చేతులు కలపవలసి వచ్చింది. ప్రపంచఫాసిస్టులని ఎదుర్కొనడానికి. ఐనా తన సామ్రాజ్యలాభాలను వదులుకొని యుద్ధంలో వ్యవహరించడం లేదనడానికి అమెరీ వంటి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పదే పదే ప్రకటించుచున్న మాటలు మనకు తెలిసినవే. తనవద్దనున్న ఆస్తి సంపద వంతటిని యుద్ధంలో వ్యయంచేసింది. ఇదివరలో ఇంగ్లాండు ఇతరదేశాలకు పెట్టుబడులు పెట్టానన్నవాటిలో దాదాపు అంతాఅనవచ్చు నేమో 218 కోట్ల 50 లక్షలపౌనులను 1940, 41, 42 సంవత్సరాలలో వసూలు చేసికొని వ్యయంచేసింది. లండన్‌నగరం ప్రపంచ మంతటికి ప్రముఖవ్యాపారకేంద్రమైనందున సామ్రాజ్యదేశాలు,మరి ఇతరదేశాలుకూడా ఇంగ్లండులో ఉంచుకొనిన స్టర్లింగు నిల్వలను వాడుకుంది. ఈ క్రిందిదేశాలకు ఈ విధంగా బాకీ తేలింది.

లక్షల పౌండ్లల్లో

ఇండియాకు 1943 జూలై	5000
కెనడా (వడ్డీలేదు)1943 జూలై	1570
మలయాకు 1941 జూలై	580
న్యూజీలాండు 1943 ఫిబ్రవరి	340
ఐర్లాండు 1943 మార్చి	1210
ఈజిప్టు 1942 డిసెంబరు	710
ఆస్ట్రేలియా 1943 మే	640
అర్జెంటైనా 1942 డిసెంబరు	170

ఇవిగాక ఇంకా వలసదేశాల కరెన్సీనోట్లకు ప్రత్యేక ఖాతాలవారు, మధ్య ప్రాచ్యదేశాల విలువ బాకీలు కలిపితే 100 కోట్ల పౌనులు. అంటే సుమారు రు. 1400 కోట్ల రూపాయిలు మించుతుంది.

'ఎకానమిస్టు' లెక్కల ప్రకారం ఇంగ్లాండే-ఇండియాకు 1943 జూలై నాటికి 2270 లక్షలపౌండ్లు, అంటే 302 కోట్లు రూపాయిలు ఇదివరకు ఋణాలుతీర్చంగా బాకీపడ్డదని తేలింది.

ఈ స్టర్లింగుల బాకీమీద ప్రస్తుతం ఇండియాలో రిజర్వుబ్యాంకినోట్లు జారీచేస్తున్నది. ఈ జూన్ 2 వ తేదీకి రిజర్వుబ్యాంకి లెక్కలప్రకారము:

చలామణిలోవున్ననోట్లు	రు 926 కోట్లు
అందులోస్టర్లింగు సెక్యూరిటీలు	రు 816 కోట్లు
బంగారపుముద్ర హామీ	రు 44 కోట్లు
రూపాయినాణెములు	రు 13 కోట్లు
రూపాయి సెక్యూరిటీలు	రు 53 కోట్లు

అందువలన బిర్లా—టాటా ప్లానులో వారు అంచనావేసిన 1000 కోట్లురూపాయలు ఇంకా యుద్ధం జరుగుచున్నందున పూర్తి కావడమేకాకుండా ఇంకామించవచ్చు. అధిక ధరలకు, కటికోవపాసాలకు, కరువులకు దానులమై సంపాదించిన ఇది మనప్రజలఆస్తి.

[ఇది ఏవిధంగా వాడుకోవాలి అనే సమస్యపై భారతదేశంలోనూ, బ్రిటనులోనూకూడ తర్జనభర్జనలుజరుగుతున్నాయి. భారతప్రజలకు అనుకూలంగా వినియోగించుకునేవిధం ఏమిటి? అనేవిషయంపై వ్యాసం రాబోవుసంచికలో ప్రకటించుతాము. సం.]

★

మునగాల రైతునాయకునిపై దౌష్ట్యము

★

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి వండూరి ప్రసాదరావుగారు యిలా వ్రాయుచున్నారు :.

తిరిగి తిరిగి బెజవాడ చేరుకునేటప్పటికి కఠోరమైనవార్త చెవినిబడింది. వెలదండ రంగారావుగార్ని,కుటుంబసహితంగా, ఎవ్వరో దుర్మార్గులు కొట్టారని. వార్తవినునరికి ఒక్కసారి 1930, 1939 ఉద్యమాలు, అప్పుడు జరిగిన దురంతాలు స్ఫురణకు వచ్చినాయి.

వెలదండ రంగారావుగారు ఎన్నోటు నౌకరీకి స్వస్తిచెప్పి రైతు వుద్యమానికి నాయకత్వం వహించారు. ఆ వుద్యమంలోనే అనేక దౌర్జన్యాలకు గురి అయ్యారు. కాపురముండే ఇల్లు పీకించి వేయబడటమేమి, పెంటపోగులకోవహ సర్వస్వం దోచుకోబడటమేమి, భూములనెవ్వరూ సాగుచేయనీయకుండా చేయటమేమి, చాకలి, మంగలి, వగయిరాలెవ్వరూ పనిచేయకుండా, ఉప్పు, పప్పు, మిర్చి మొ॥ దొరకనీయకుండాను సాంఘికంగా బహిష్కరించటమేమి, చివరకు వ్యక్తులపై దౌర్జన్యం జరుపబడటమేమి - అన్నివిధములగు దౌష్ట్యాలకూ గురియయ్యారు. 1938 లో తిరిగి రైతువుద్యమం ప్రారంభమైంది. రంగారావుగారు తిరిగి నాయకత్వం వహించారు. 1939 పోరాటంలో వారు పాల్గొనకపోయినా, ఇతరత్రా రైతులకు అమూల్యమైన సేవచేశారు. రంగారావుగారు తిరిగి ఇప్పుడు దౌర్జన్యానికి గురిమైనారు.

రైతుసేవకులకు దేశసేవవల్ల వచ్చేశాపకలితే, అయినా ఉద్యమం ఏమీ నష్టపడదు. ఇంకా ఎన్నికష్టాలు వచ్చినా, ఎన్ని దౌర్జన్యాలు జరిగినా ప్రజాసేవకులు తమ కర్తవ్యాన్ని వదలిపెట్టరు.

మూడుసంవత్సరాల సోవియట్-జర్మన్ యుద్ధం



మార్షల్ జుకోవ "ఆర్డర్ ఆఫ్ విక్టరీ" (విజయపతకం) బిరుదాంకితుడు



జనరల్ రొకొసవ్‌స్కీ కుర్స్కు-ఓరెల్ విజయాలు సాధించిన సేనాని

(1 వ పేజీ తరువాయి) అని ఆజ్ఞాపించాడు. రెడ్ఆర్మీ ఎదురుదాడి ప్రారంభించింది. ఇది ప్రపంచాన్ని, నాజీ సైనికులను ఆశ్చర్య పరచింది. నాజీమూక లిడివరకు దెబ్బగొట్టి ముందుకు పోవడమేగాని, దెబ్బతిని వెనక్కి తగ్గడం ఎరుగదు. అదీగాక, చలికా లంలో తలదాచుకోకుండా మూడుచెరువుల నీళ్ళు తాగించి ముప్పతిప్పలు పెడుతున్న సోవియటు సైనికుల, గెరిల్లాలధాటికి నాజీ సైనికుల గుండెనిబ్బరం సడలసాగింది.

మాస్కో చుట్టూవున్న ప్రదేశాలను రెడ్ ఆర్మీ వశపరచుకోసాగింది. మాస్కోకోసం జరిగిన యుద్ధంలో హిట్లరు ఓడిపోయాడు. మాస్కోనుండి 200 మైళ్ల వరకు శత్రువు నెట్టివేయబడ్డాడు. కెర్చికూడ రెడ్ఆర్మీ వశమయింది. ఇక లెనిన్‌గ్రాడ్ విషయంలోకూడ శత్రువు విఫలుండయ్యాడు. అనేక కష్టాలను లెనిన్‌గ్రాడ్ పౌరులు ఎదుర్కొన్నారు. బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోతే, లడోగా సరస్సుమీద మంచుగడ్డరోడ్లను నిర్మించి సంబంధం పెట్టుకున్నారు. బయటి నుండి ఆహారపదార్థాలను, ఆయుధాలను, బొగ్గును తెచ్చుకొన్నారు. పట్టణంలో వ్యాధులు రాకుండా పట్టణాన్ని శుద్ధిచేయసాగారు. ఈ విధంగా లెనిన్‌గ్రాడ్ అచంచలంగా నిలబడింది.

ఈ శీతాకాలదండయాత్ర ఫలితం ఏమిటి? హిట్లరు సైన్యాలు చలికాలంలో కాస్త ఊపిరి పీల్చుకొని, నిలబడి యుద్ధంచేద్దామని తలిస్తే, అది భగ్నం అయింది. కనీసం వసంతకాలం లోనైనా తిరిగి విజృంభించుదామన్న హిట్లరు ఆశలు భగ్నమయ్యాయి చలికాలంలో గుండె నిబ్బరంచెదిన జర్మను సైనికులకు, ఆఫీసర్లకు, "వసంతంలో దాడి చేస్తాం, చేస్తాం" అంటూ హిట్లరు ఊరడించాడేకాని, అవి ఫలించలేదు. వసంతకాలపుదాడి, వేసవికి వాయిదావేయ వలసివచ్చింది.

నాజీల సన్నాహాలు

నాజీలు ఈ శీతాకాలంలో వేసవి దండయాత్రకు ఎలాంటి ప్రయత్నాలు చేశారో చూద్దాం. బాలకులను, వృద్ధులనుకూడా సైన్యంలో చేర్పించసాగారు. జర్మను కార్మికులను ఫ్యాక్టరీలనుండి తీసుకువచ్చి సైన్యంలో చేర్చారు. ఇతరదేశాల ప్రజలచేత బలవంతంగా తమ ఫ్యాక్టరీలలో పనిచేయించసాగారు. ఇంతేగాక తమక్రింద తొత్తులుగా పనిచేసే ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారు. అయినప్పటికీ వసంతకాలంలో జర్మనీదాడి చేయలేకపోయింది. 1942 వేసవి నాటికి తనకున్న 256 డివిజన్లలో 179 డివిజన్లను సోవియట్‌పైకి సన్నాహపరిచింది. ఇవిగాక రుమేనియా, ఫిన్లండు, హంగరీ, ఇటలీ, స్పెయిన్ మొదలగు హిట్లరుక్రింద బానిసదేశాలు 61 డివిజన్లను సప్లయిచేశాయి.

రెండవరంగం లేకపోవడం ఫలితంగా, హిట్లరు చాలవరకు తనసైన్యాలను పశ్చిమ దిశ నుండి కదల్చగల్గాడు. 1942లో విజయం తనదేనని ప్రగల్భాలు కొట్టాడు.

1942 వేసవిలో

వేసవిదాడి తీవ్రంగా ప్రారంభించేముందు కొన్ని విజయాలను సంపాదించాలని హిట్లరు ప్రయత్నించాడు మే 8వ తేదీన కెర్చిభూసంధి పైకి జర్మనుసైన్యాలురికాయి. మే నెలాఖరుకు కెర్చి జర్మనుసేనల వశమయింది. కాని డాన్, డానెట్జు నదులదాటి కాకేషియా మీదకు పోవాలన్న ప్రయత్నం నెరవేరలేదు.

కెర్చినుండి ముందుకుపోవాలంటే సెబాస్టపోల్ పక్కలో బల్లెంగావుంది. అందుచే దీనిపైకి జూన్ 7వ తేదీన 3 లక్షల సైన్యాలతోను, 400 టాంకులతోను విజృంభించి, జులై 3వ తేదీన వశపరచుకొన్నాడు. 8 నెలలు అప్రతిమాన సాహసంతో నిలబడి లక్షన్నర జర్మనుసైనికులను బలిగొని సెబాస్టపోల్ శత్రువులవశమయింది.

జూన్ 28వ తేదీన హిట్లరు వేసవిదండయాత్ర ప్రారంభించాడు. ఈ దెబ్బతో ఏదో ఒకటి తేల్చుకోవాలని తలచాడు. ఒకవైపున స్టాలిన్‌గ్రాడును ఆగస్టులో పట్టుకుని, వెనుక వైపుగా మాస్కోను స్వాధీనపరచుకొందామనుకొన్నాడు. మరొకప్రక్క కాకసస్ మీదుగా ఇండియాపైకి దండెత్తి, టోజోతో భారతదేశంలో చేతులుకలుపుదామని ఆశించాడు.

మొదట్లో జర్మన్లు కొన్ని విజయాలు పొందారు. వొరొనెజ్ గుమ్మంలోకి నాజీ సైన్యాలు వచ్చాయి, రోస్టావ్ తిరిగి నాజీల వశమయింది. ఉత్తర కాకసస్‌లో చాలభాగం నాజీ సైనికులాక్రమించుకోగలిగారు. మోజడాక్, మైకాప్, మొదలగు నూనెగనుల ప్రదేశాలను వశపరచుకున్నారు. గ్రోజ్నీ నూనెగనులకు ప్రమాదం ఘెచ్చింది. అటు నాజీలు వోల్గానదీతీరంవరకు చొచ్చుకురాగల్గారు. స్టాలిన్‌గ్రాడ్‌లో అడుగుపెట్టగలిగారు. జర్మన్లు ఇది తమ విజయమని గట్టిగా నమ్మసాగారు.

స్టాలిన్‌గ్రాడ్ వీరగాధ

ఈయుద్ధచరిత్రలో స్టాలిన్‌గ్రాడ్ సువర్ణాక్షరాలతో లిఖింపబడుతుంది; స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలోనే హిట్లరు పరాజయం ప్రారంభమయింది. స్టాలిన్‌గ్రాడ్ యుద్ధమే, మిత్రరాజ్య విజయాలకు ప్రాతిపదిక వేసింది.

1942 ఆగస్టు 23 న స్టాలిన్‌గ్రాడ్‌పై ఫాసిస్టు పిశాచ సైనికులురికారు. 2 వేల విమానాలొక్కసారి స్టాలిన్‌గ్రాడ్‌పై మంటలు కురిపించాయి. ఆగస్టు 25వ తేదీకల్లా స్టాలిన్‌గ్రాడ్‌వశంకాగలదని ఆశించారునాజీలు. అదివిఫలమయినా, ఆగస్టు 27న హిట్లరిలా అన్నాడు: "బోల్షివిక్కు ఉక్కుకోట స్టాలిన్‌గ్రాడ్‌కోసం యుద్ధంప్రారంభమయింది. స్టాలిన్‌గ్రాడ్ పడిపోకతప్పదు."

కాని స్టాలిన్‌గ్రాడ్ నాజీ ముష్కరుల ముందు తల వాల్చలేదు. అక్టోబరు మాస మధ్యంలో యుద్ధం భయంకరరూపందాల్చింది. ప్రపంచ చరిత్రలో ఎన్నడూ ఎరుగని ఉచ్చస్థాయిలో యుద్ధంసాగింది. స్టాలిన్‌గ్రాడ్ చుట్టూ కట్టుకొన్న రక్షణ శ్రేణులులేవు. కాని స్టాలిన్‌గ్రాడ్‌లోని ప్రతిఒక్క అంగుళమూ, ప్రతిఇల్లూ, అభేద్యమైన రక్షణశ్రేణులుగా మారాయి. స్టాలిన్‌గ్రాడ్‌కుసప్లయిలు విమాన దాడులమధ్య వోల్గానదినిదాటిరావాలి. అయినా స్టాలిన్ "ఒక్కడుగుకూడా వెనక్కి వేయవద్దు" అన్నమాటను సోవియట్ వీరులు పాటించారు. "వోల్గానదికి అవతల మనకు మాతృభూమి లేదు. మనం ఒక్కడుగు వెనక్కివేయరాదం"టూ సోవియటుసైనికులు దృఢనిశ్చయంతో పోరాడారు. నవంబరు 7వ తేదీన స్టాలిన్‌గర్జించాడు "శత్రువు మన దెబ్బలను తట్టుకోవలసిన సమయంఇంకెంతో దూరానలేదు. మనవంతు వస్తోంది." నవంబరు 19వ తేదీన రెడ్ఆర్మీ స్టాలిన్‌గ్రాడ్ వద్దతిరుగుదాడి ప్రారంభించింది. ఆనాటినుండి నేటివరకు జర్మనీఒకటే పలాయనంసాగించుతోంది. సోవియటు సైనికనాయకుల వ్యూహంలో జర్మనుసేనలు పడిపోయాయి. 22 నాజీడివిజన్లు చుట్టుముట్టడింపబడ్డాయి. 3 లక్షల ముప్పదివేలమంది జర్మన్లు ఉక్కువలయంలో చిక్కారు. స్టాలిన్‌గ్రాడ్ వశం కాకపోతేమానె, వీరోచితంగా తుదివరకు పోరాడి ప్రాణాలర్పించుటద్వారా నాజీ సైన్యాధిపతులు తమ ప్రజలలో ఉత్సాహాన్ని రేకెత్తించుతారని హిట్లరు ఆశించాడు. స్టాలిన్‌గ్రాడ్‌రంగంలో పోరాడుతూ చిక్కువడిన జర్మనుసైన్యాధిపతి పౌలస్‌ను హిట్లరు ఫీల్డుమార్షల్‌జనరల్‌గా చేశాడు. కాని చేసేదేమీ లేక, ప్రాణంమీదితీపి వదల్లేక పౌలస్, 24 మంది జనరల్సుతో 1943 జనవరి 31 న లొంగిపోయాడు. దాదాపు లక్షమంది జర్మన్లు ఈ దెబ్బలో సోవియటు వశమయ్యారు. తక్కినవాళ్లు క్రమంగా హతులయ్యారు. ఫిబ్రవరి 2వ తేదీకి, చుట్టుముట్టడించబడిన సైసైన్యాలు హతమారాయి.

నాజీజర్మనీతోపాటు, దాని బానిసదేశాలు కూడ విపరీతనష్టాలకు గురిఅయ్యాయి. సోవియటు రంగంలోని రుమేనియా, ఫిన్లండు సైన్యాలు సర్వనాశనం అయ్యాయి. ఇటలీ, హంగరీ సైన్యాలు ఛిన్నాభిన్నమయినాయి. మిత్రరాజ్యాలు లిబ్యా, ఉత్తరాఫ్రికాలలో జయంపొందడానికి, స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం మిత్రరాజ్యాలకు అవకాశమిచ్చింది.

జర్మనీ అప్పటికి 90 లక్షల ఫేసిస్టుసైన్యాలను నష్టపోయింది. దిట్టంగా తరిఫీదు పొందిన యస్. యస్. దళాలులాంటివి హతమయ్యాయి ఆయుధసామగ్రి ఎంత నష్టపడిందో చెప్పనక్కరలేదు.

1942 శీతాకాలంలో

ఒక్క స్టాలిన్‌గ్రాడ్ రంగంలోనే సోవియటుసైన్యాలు ఎదురుదాడులు సాగించి ఊరుకోలేదు. అనేకచోట్ల ప్రారంభించాయి. నవంబరు 25న వెలికిలుకి పశ్చిమంగా దండయాత్రసాగించాయి. డిశంబరు 22న కాకసస్‌లో మొజ్‌డాక్‌నుండి నాల్చిక్‌వరకు సోవియటుసేనలు ఎదురుదాడులు సాగించాయి.

1943 జనవరి 12వ తేదీన లెనిన్‌గ్రాడ్ చుట్టూవున్న వలయం బద్దలుచేయడానికి దండయాత్ర ప్రారం (మిగతా 10వ పేజీలో)



జనరల్ మెరెట్స్కోవ్



జనరల్ గొవరోవ్

లెనిన్‌గ్రాడ్ విజయం సాధించిన సేనాధిపతులు

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE